తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# అష్టలక్ష్మీమండపంలో వేడుకగా వరలక్ష్మీవ్రతం

## -సాయంత్రం స్వర్ణరథంపై శ్రీమహాలక్ష్మి



**-స్వర్ణరథంపై మహాలక్ష్మి: వరలక్ష్మీవ్రతం పర్వదినాన శుక్రవారం సాయంత్రం సిరులతల్లి పద్మావతిఅమ్మవారు శ్రీమహాలక్ష్మీదేవిగా స్వర్ణరథంపై విహరించి భక్తులను కటాక్షించారు. అమ్మవారి స్వర్ణరథం వీక్షించిన భక్తులు ఆనందపరవశులయ్యారు.**

తిరుపతి/తిరుచానూరు, ఆగస్ట్ 16ప్రభాతవార్త:
శ్రావణమాసం శుక్రవారం ఉదయం వరలక్ష్మీవ్రతాన్ని తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారి ఆలయంలో టిటిడి శాస్త్రోక్తంగా వేడుకగా నిర్వహించింది. అమ్మవారి ఆలయంలోని ఆస్థాన మండపాన్ని అష్టలక్ష్మీమండపంగా అష్టలక్ష్మీమూర్తులతో, రోజాలు, తామరపూలు రంగురంగుల 2టన్నుల సంప్రదాయ పుష్పాలు, పదిరకాలు 20వేల కట్‌ఫ్లవర్స్ తో ,పండ్లుతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. ఇక్కడ ఉదయం నుండి ఆలయ ప్రధాన అర్చకుడు బాబుస్వామి ఆద్వర్యంలో అర్చకులు వేదోక్తంగా పాంచరాత్ర ఆగమంప్రకారం అమ్మవారికి సాంప్రదాయ పుష్పాలతో వేదఘోష నడుమ ఆరాధించారు. భక్తులందరికీ శుబాలు కలగాలని, మహాలక్ష్మీవరలక్ష్మీదేవి అనుగ్రహం లభించాలని ప్రార్థించారు. మహిళా భక్తులకు అమ్మవారి కంకణాలు, పసుపుదారాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినాని దంపతులు, టిటిడి ఈఓ జె.శ్యామలరావు దంపతులు, టిటిడి జెఈఓలు గౌతమి దంపతులు,వీరబ్రహ్మం దంపతులు, ఆలయ డిప్యూటీ ఈఓగోవిందరాజన్ ఆలయ ఎఈఓరమేశ్, గృహస్థభక్తులు పాల్గొన్నారు.

# డిఎస్పీ కార్యాలయం కోసం స్థలపరిశీలన చేసిన కలెక్టర్.. ఎమ్మెల్సీ

కుప్పం, ఆగస్టు 16 ప్రభాతవార్త
కుప్పం పట్టణంలో నూతన డిఎస్పీ కార్యాలయం నిర్మాణానికి సంబంధించి అవసరమైన స్థలాలను గుర్తించేందుకు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్సీ,సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, కడ పిడి వికాస్ మర్మత్‌లు పరిశీలించారు. కుప్పం మున్సిపల్ పరిధి కొత్తపేటలో ఖాళీ స్థలాలు, కొత్తపేటలో నిరుపయోగంగా ఉన్న మార్కెట్ భవనాలను పరిశీలి ంచారు. కాగా రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణంతో రైల్వే గేటును రైల్వే అధికారులు మూసేశారని కొత్తపేట ప్రజలు కలెక్టర్‌కు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు రాజు, కమీషనర్ శ్రీనివాసరావు, రాష్ట్ర నేత డా॥ సురేష్‌బాబు, నేతలు అప్పు, కన్నన్ తదితరులు పాల్గొన్నారు.



# గగనం ఇక మరింత దగ్గర

**తక్కువ ఎత్తు నుంచి ఉపగ్రహాల పరిశోధన**

**- ఎస్ఎస్ఎల్‌వి డి3 సక్సెస్‌తో ఇస్రోలో ఆనందం- ఇక ముందు షార్‌తో విదేశీ లాభాల పంట**

**- కక్ష్యలోకి ఇఓఎస్ 08, డెమోశాట్ ఉపగ్రహాలు- మన ఛోటాభాయ్‌తో మరిన్ని ప్రయోజనాలు**



శ్రీహరికోట (తడ), ఆగస్టు 16 ప్రభాతవార్త
అంతరిక్ష పరిశోధనలో భారత్ మరో గఘన విజయం సాధించింది. శుక్రవారం ఉదయం భూమికి కేవలం 475 కిలోమీటర్ల తక్కువ దూరంలో రెండు ఉపగ్రహాలను విడిచిపెట్టింది. సాధారణంగా అంతరిక్షంలోకి ఉపగ్రహాలను చేర్చేటప్పుడు నిర్ణీత కక్ష్య ఎక్కువ దూరంలో ఉంటుంది. అయితే మన ఛోటాభాయ్ ఎస్ఎస్ఎల్‌వి రాకెట్ మాత్రం తక్కువ దూరంలో ప్రవేశపెట్టి ఉపగ్రహాల ద్వారా ఎంతో ఉపయోగం సాధించడానికి కారణమయింది.



శుక్రవారం ఉదయం సరిగ్గా 9.17 గంటలకు షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి ఈ రాకెట్‌ను అంతరిక్షంలోకి విడిచిపెట్టారు. సుమారు 17 నిమిషాల వ్యవధిలో ఉపగ్రహాలు కక్ష్యలో ప్రవేశించాల్సి ఉండగా, కనీసం అర నిమిషం ముందే ఈ రాకెట్ గఘన కార్యం పూర్తి చేసింది. అంతరిక్షానికి, భూమికి తక్కువ దూరంలో ఉపగ్రహాలు ప్రవేశించడం వల్ల విదేశీ శాటిలైట్లను కూడా ఇక్కడి నుంచి ప్రయోగించడానికి కొన్ని దేశాల వారు ముందుకొచ్చే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఎస్ఎస్ఎల్‌వి డి3 ఇస్రోకు సంబంధించిన 6వ తరహా రాకెట్. భూమికి కేవలం 500 కిలోమీటర్ల కన్నా తక్కువ దూరంలో 10 నుంచి 500 కిలోల బరువు ఉన్న ఉపగ్రహాలను ప్రవేశపెట్టడానికి ఈ తరహా రాకెట్లను నిర్మించింది. జిఎస్ఎల్‌వి మార్క్3 వంటి అత్యంత భారీ రాకెట్లను అలవోకగా అంతరిక్షంలోకి చేర్చే ఇస్రో ఈ ఎస్ఎస్ఎల్‌వి ప్రయోగాన్ని గురిచూసి వదిలిపెట్టారు. దీనిద్వారా 175.5 కిలోల ఇఓఎస్08 భూపరిశీలన ఉపగ్రహంతో పాటు మరో పరిశోధనాత్మక డెమోశాట్ ఉపగ్రహాన్ని కూడా అంతరిక్షంలోకి చేర్చారు. ఈ డెమో శాట్ బరువు కేవలం 0.2 కిలోలుగా ఉంది. ఇస్రో ఇప్పటిదాకా ప్రయోగించిన అతి చిన్న ఉపగ్రహాలలో ఇది ఒకటి. ఈ ప్రయోగ విజయం తర్వాతఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ మొదట మిషన్ కంట్రోల్ సెంటర్‌లోను, అనంతరం మీడియా సెంటర్‌లోను హుషారుగా కనిపించారు. మూడు ఘన ఇంధన దశలతో పైభాగాన విటిఎం అమరికతో ఈ రాకెట్‌ను రూపొందించి ప్రయోగించారు.

**మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టాం - మిషన్ డైరెక్టర్**

ఎస్ఎస్ఎల్‌వి డి3 ప్రయోగ విజయం తర్వాత మిషన్ డైరెక్టర్ ఎస్ఎస్ వినోద్ మాట్లాడుతూ ఇది ఒక ఇస్రోకి మైలు రాయిగా చెప్పారు. శాస్త్రవేత్తల సమష్టి కృషి, యాజమాన్యం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోగలిగామని ఆయన అన్నారు. ఖచ్చితంగా అనుకున్న సమయాన అనుకున్న కక్ష్యకు రెండు ఉపగ్రహాలను ప్రవేశపెట్టామన్నారు. దేశంలోని అన్ని ఇస్రో సెంటర్లలో పనిచేస్తున్న వారంతా ఇందుకోసం కృషి చేశారని, ముఖ్యంగా యుఆర్‌రావు శాటిలైట్ సెంటర్లో ఈ ఉపగ్రహ రూపకల్పనకు నిరంతరం శ్రమించారన్నారు. అహ్మదాబాద్‌లోని శాటిలైట్ సెంటర్ నుంచి సాంకేతిక పరిజ్ఞానాన్ని త్వరగా పూర్తి చేసుకొని ఎస్ఎస్ఎల్‌విని ప్రయోగించినట్లు చెప్పారు.

**ఇఓఎస్08తో ఎన్నో ఉపయోగాలు - శాటిలైట్ డైరెక్టర్**

భూపరిశీలన ఉపగ్రహం ఇఓఎస్08ని తయారు చేసిన శాస్త్రవేత్తలు దీన్ని భవిష్యత్ ప్రయోజనాల కోసం సరికొత్త సాంకేతిక పరికరాలతో రూపొందించారని శాటిలైట్ డైరెక్టర్ ఎం.అవినాష్ పేర్కొన్నారు. ఇటువంటి విజయం శాస్త్రవేత్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందన్నారు. ప్రకృతి వైపరిత్యాలను పసిగట్టడం, రిమోట్ సెన్సింగ్ తరహా సేవలు అందించడం ఇఓఎస్08 ప్రత్యేకతగా చెప్పారు. యుఆర్ఎస్‌సి డైరెక్టర్ శంకరన్ ఇచ్చిన ప్రోత్సాహం, ఇస్రో కుటుంబాలు తమకు ఇచ్చిన సహకారం ఎప్పటికీ మరచిపోలేనిదని, ఈ రాకెట్ ప్రయోగం సమయంలో ఇక్కడకు రాని ప్రతి శాస్త్రవేత్తలకు అభినందనలు చెప్పారు.

## 18 నెలల విరామం తర్వాత

ఛోటాభాయ్‌గా కొందరు పేర్కొంటున్న స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సిరీస్ ఎంతో ఉపయోగకరమైనది అయినప్పటికీ ఈ బులి రాకెట్ నిర్మాణంలోను ఆలస్యం చోటుచేసుకుంది. మొదటి, రెండవ ఎస్ఎస్ఎల్‌వి ప్రయోగాలకు కేవ్వలం ఆరునెలల సమయం తీసుకుంటే.. రెండు, మూడు రాకెట్ల ప్రయోగానికి ఏకంగా 18 నెలల సమయం తీసుకుంది. దీన్ని ఇస్రో ఛైర్మన్ దృష్టికి తీసుకురాగా, ప్రతి నెలా ప్రయోగమంటే సాధ్యం కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే ఛైర్మన్ గతంలో శ్రీహరికోట నుంచి ఇక ప్రతి నెలా ప్రయోగాలు ఉంటాయని, అవసరమైతే ఈ సంఖ్య పెరుగుతుందని పలుమార్లు స్పష్టం చేసి ఉన్నారు. ఒకవైపు ప్రైవేటు వారి భాగస్వామ్యం సక్రమంగా అందుతుందని చెబుతున్న శాస్త్రవేత్తలు రాకెట్ నిర్మాణం, ప్రయోగాలలో జరుగుతున్న ఆలస్యానికి సరయిన సమాధానం చెప్పకపోవడం విశేషం.

# పేదవాడిని మరిచితే...నామరూపాలుండవ్

## -అన్నా క్యాంటీన్ ప్రారంభంలో చల్లా



పుంగనూరు, ఆగస్టు 16 ప్రభాతవార్త
పేదవాడి అభ్యున్నతి మరిచిపోతే ఎంతటి వారికైనా చరిత్రలో స్థానం ఉండబోదని తెలుగుదేశం ఇన్‌చార్జి చల్లాబాబు అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలో అన్నాక్యాం టీన్ ప్రారంభించారు. ఆయనకు మున్సిపల్ కమీషనర్ నర్సింహప్రసాద్,దేశం నాయకు లు సివిరెడ్డి,గిరి,సుహేల్‌బాషా స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదలపేరు చెప్పి వేల కోట్లు దోచుకుని,పేదల ఆకలి తీర్చే అన్నాక్యాంటీన్‌ను నిర్లక్ష్యం చేసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో పుంగనూరులో అసలు సిసలైన అభివృద్ధికి శ్రీకారం జరగ బోతోందన్నారు. కేంటీన్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన చల్లాబాబుకు పార్టీశ్రేణులు ఘనమైన స్వాగతం పలికాయి.పార్టీనాయకుల సివిరెడ్డి, పోలీస్‌గిరి,సయ్యద్‌సు హేల్‌బాషా ,సుకుమార్ బాబు,మాధవరెడ్డిలతో పాటూ పలువురుతో చల్లాబాబు పలువిషయాలు చర్చించారు. పుంగ నూరు పోలీసులు ఇటీవల తమపై పెట్టిన కేసుల గురించి వివరించారు. తన అనుచరులతో తెలుగుదేశం నాయకులపై రాళ్ళ దాడులు నిర్వహించిన ఎంపి మిధున్‌రెడ్డిపై ఎందుకు ఆరెస్టు చర్యల తీసుకోలేదో పోలీసులు వివరించడంలేదని ఆరోపించారు. త్వరలో పుంగనూరులో పార్టీ స్థాయి సమావేశాలు నిర్వహించబోతున్నట్లు చల్లాబాబు తెలిపారు. అన్నాక్యాంటీన్ ప్రారంభంలో కూటమి పార్టీల నాయకులు పార్టీశ్రేణులు,కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# దక్షిణ కైలాసంలో సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు

## కడలి తరంగాల్లా కదలి వచ్చిన భక్తులు: చక్కటి ఏర్పాట్లు



శ్రీకాళహస్తి,ఆగస్టు 16 ప్రభాతవార్త
దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తీశ్వరాయంలో శ్రావణ శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతపూజలు నిర్వహించారు.శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో బ్రహ్మగుడి వద్ద శ్రావణ మాసం రెండవ శుక్రవారం వరలక్ష్మీవ్రతాన్ని మహిళలు ఉపవాస నియమనిష్టలతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయం నాల్గవ గేటు నుంచి ఆలయం వరకు మామిడి తోరణాలు పూల తోరణాలు, అరటి చెట్లతో ముస్తాబు చేశారు. నిత్యకళ్యాణం పచ్చతోరణం అన్నట్లు అరటి చెట్లతో ముస్తాబు చేశారు. పట్టణంలోని ఇతర ఆలయాల్ని కూడా ముస్తాబు చేశారు. వేదికపై అమ్మవారి ఉత్సవ మూర్తికి విశిష్ట పుష్పాలంకరణలు కన్నులపండువగా చేశారు. కలశ స్థాపన గావించారు.వేదపండితులు ఆలయ పౌరోమితులుఅర్థగిరి అర్చకులు కరుణాగురుకుల్ వేదపండితులు తదితరుల ఆధ్వర్యంలో వ్రతం మహాత్మ్యంను పఠిస్తుండగా శాస్త్రోక్తంగా మహిళలు పూజలు నిర్వహించారు. పూజల్ని ఆలయానికి చెందిన ప్రధానాచార్యులు పూజలను నిర్వహించారు. మహిళలు నోములు నోచుకున్నారు. మహిమాన్వితమైన ఈ వ్రతాన్ని ఆచరించుటకు దేవస్థానం తరఫున ఏర్పాట్లతో పాటు పలువురు భక్తులు వాయనాల్ని అందించారు. పూజలను ఉదయం నుంచి ప్రారంభించారు.మొదటి విడత పూజల్లో డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి సూచనలతో ఏర్పాట్లు చేపట్టారు.చక్కటి ఏర్పాట్లు:
మహిళల మనోభావాలకు సంబంధించిన ఉత్సవం కాబట్టి ఇఓ ఎన్‌వియస్‌ఎన్ మూర్తి ప్రత్యేక దృష్టి సారించారు. ఇక్కడే తిష్టవేసి ఇంజనీరింగ్ అధికారులతో పనులు చేయించారు. శుక్రవారం 'భేష్'అంటూ మహిళా భక్తుల నుంచి ప్రశంసలందుకున్నారు.ఇఓ నాలుగురోజుల ముందునుంచే ఇంజనీరింగ్ విభాగం డిఇఇ శ్రీనివాసులురెడ్డి, స్థపతి కుమార్‌లకు బాధ్యతలు అప్పగించారు. మహిళలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లుచేయాలని ఆదేశించారు. ఇక్కడ ఏర్పాటుచేసిన ప్రత్యేక షెడ్డులో చక్కటి ఏర్పాట్లు చేసారు. అమ్మవారిని ఎంతో చక్కగా అలంకరించారు.ఇక వ్రతం నిర్వహించిన తీరు మహిళల ప్రశంసలందుకుంది. కన్నులు మిరుమిట్లు గొల్పునట్లు ఆలయ ఉద్యోగులు తీర్చిదిద్దారు.పూజలు జరుపుకునే మహిళలకు దేవస్థానం తరఫున పూజా సామగ్రి అందించారు. గతంలో కన్నా ఈ ఏడాది సామూహిక వరలక్ష్మీ వ్రతానికి మహిళలు విశేష సంఖ్యలో హాజరయ్యారు. వారికి ఎలాంటి లేకుండా ఏర్పాట్లు చేసి ప్రశంసలందుకున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంకు సత్వర చర్యలు

## - జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్



కుప్పం, ఆగస్టు 16 ప్రభాతవార్త
ప్రజా సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగం సత్వర చర్యలు తీసుకోవాలని సాధ్యమైనంత త్వరగా వారి సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కుప్పం మండల కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ సమస్యలపై ప్రజలు 158 వినతిపత్రాలను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. వీటిలో అత్యధికంగా రెవెన్యూకు సంబంధించి 88 ఫిర్యాదులు అందాయి. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ప్రజా సమస్యల పరిష్కారంకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలనుంచి అందిన వినతులను ఆయా శాఖల వారీగా పంపడం జరుగుతుందని అధికారులు వాటి పరిష్కారమార్గాలు చూపాలని ఆదేశించారు. ప్రజలనుంచి తీసుకున్న అర్జీలకు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఆర్డీఓ శ్రీనివాసులురాజు, డ్వామా పిడి రాజశేఖర్, డిఎస్పీ పార్థసారథి, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత డా॥ సురేష్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

# పురుషోత్తమునికి నూలుపవిత్రమాలలు

తిరుమల,ఆగస్ట్ 16ప్రభాతవార్తప్రతినిధి:
భక్తుల వల్లగానీ, ఆలయ సిబ్బందివల్లగానీ దేవదేవుడు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన దోషాల నివృత్తికి జరిపించే పవిత్రోత్స వాల్లో రెండవరోజు శుక్రవారం ఉదయం పురుషోత్తమునికి పవిత్రమాలలు సమర్పించారు.












# సర్పంచ్‌ల చెవిలో పువ్వులు

**- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణ ఖర్చులకు విడుదల కాని నిధులు**

**- పంచాయతీ నిధులే ఖర్చు చేసి లెక్కరాయాలని ఉత్తర్వులు**



చిత్తూరు, ఆగస్టు 16 ప్రభాతవార్త:
పంచాయతీ సర్పంచ్‌ల చెవుల్లో డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పువ్వులు పెట్టారు. గ్రామ పంచాయతీల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణ ఖర్చులను ఒక్కసారిగా రూ.100, రూ.250 నుండి రూ. 10 వేలు, రూ.25 వేలకు పెంచినట్లు డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ప్రకటించడంతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణ ఖర్చులకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేస్తుందని పంచాయతీ సర్పంచ్‌లు సంబరపడ్డారు. స్వాతంత్ర్య దినోత్సవ నిర్వహణ వేడుకలు జరిగే రోజు సైతం ప్రభుత్వం పంచాయతీలకు వేడుకల నిర్వహణ ఖర్చులకు ప్రత్యేకంగా నిధులు విడుదల చేస్తుందని సర్పంచ్‌లు ఆశగా ఎదురు చూశారు. అయితే పంచాయతీలు స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహణ ఖర్చు పెట్టి ఆ మేరకు పంచాయతీ నిధుల నుండి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణ ఖర్చుల కింద తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టంగా జిఓఆర్‌టి నెం.450 జారీ చేయడంతో సర్పంచ్‌లు భిన్నులయ్యారు. చిత్తూరు జిల్లాలో మొత్తం 696 గ్రామ పంచాయతీలు వుండగా అందులో 670 మైనర్ గ్రామ పంచాయతీలు, 26 మేజర్ గ్రామ పంచాయతీలు వున్నాయి. ఇది వరకు గ్రామ పంచాయతీలు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించడానికి మైనర్ గ్రామ పంచాయతీలు అయితే రూ.100, మేజర్ గ్రామ పంచాయతీలు అయితే రూ.250 ఖర్చు చేయాల్సివుంటుంది. ఈ ఖర్చులను పంచాయతీ నిధుల నుండి తీసి ఖర్చు చేసి పంచాయతీ లెక్కల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణ ఖర్చుల కింద మైనర్ గ్రామ పంచాయతీ అయితే రూ.100, మేజర్ గ్రామ పంచాయతీ అయితే రూ.250 లెక్కలు రాసుకొనే వారు. ప్రతి ఏడాది నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ, గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు ప్రభుత్వం ఖరారు చేసిన మేరకు మైనర్ గ్రామ పంచాయతీ అయితే రూ.100, మేజర్ గ్రామ పంచాయతీ అయితే రూ.250 ఖర్చు చేస్తే ఈ నిధులు ఏ మాత్రం సరిపోయేవి కావు. ఈ మేరకు సర్పంచ్‌లు స్వాతంత్ర్య దినోత్సవ నిర్వహణ వేడుకల కింద చేసిన ఖర్చును పంచాయతీ పరిధిలో ఇతర అభివృద్ధి పనులు చేసినట్లు లెక్కలు రాసి పంచాయతీ నిధుల నుండి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు జరిగిన ఖర్చును తీసుకునేవారు. ఇప్పుడు సైతం ఇదే లెక్కన గ్రామ సర్పంచ్‌లు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణ ఖర్చుల కింద మైనర్ గ్రామ పంచాయతీ అయితే రూ.10 వేలు, మేజర్ గ్రామ పంచాయతీ అయితే రూ.25 వేలు పంచాయతీ లెక్కల్లో చూపించి డబ్బులు డ్రా చేసుకోవచ్చును. అయితే ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత వుండటంతో డిప్యూటీ సిఎం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు ప్రత్యేకంగా గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేస్తారని సర్పంచ్‌లు డిప్యూటీ సిఎం ప్రకటన చేసిన రోజు నుండి సంబరపడ్డారు. అయితే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ముగిసినా పంచాయతీలకు డిప్యూటీ సిఎం ప్రకటించిన మేరకు నిధులు విడుదల కాకపోవడంతో ఈ విషయంపై ఆరా తీసిన సర్పంచ్‌లకు పంచాయతీ నిధుల నుండి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణ ఖర్చులు తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టంగా ఉత్తర్వులు జారీ చేయడంతో ఖంగుతిన్నారు.

## నేటి నుంచి శ్రీకార్యసిద్ధిఆంజనేయస్వామి వారి విగ్రహప్రతిష్ట

సదుం, ఆగస్టు16ప్రభాతవార్త

మండల పరిదిలోని జోగివారిపల్లె పంచాయతీ బత్తలవారిపల్లెలో సుంకర కుటుంబసభ్యులచే శ్రీకార్యసిద్ధి ఆంజనేయస్వామి వారి ఆలయ నిర్మాణం జరిగింది. ఈ ఆలయంలో విగ్రహప్రతిష్ట, కుంభాభిషే కమహోత్సవాలు శనివారం నుంచి జరుగనున్నాయి. ఈ మేరకుఏర్పాట్లు పూర్తి చేశారు. 17వ తేదీ ఉదయం గోపూజ,గణపతి పూజ, అఖండదీపారాదన,కళశ స్థాపన, కార్యసిద్ది ఆంజనేయస్వామి విశేషాంగ ఫల పంచామృత అభిషేకం,సాయంత్రం దీక్షాహోమం, మహాగణపతి హోమం, తదితరాలునిర్వహిస్తారు. 18వ తేదీ ఉదయం నవగ్రహ అష్టదిక్పాలక హోమం, ఆంజనేయస్వామి వారి విగ్రహ ఊరేగింపు కార్యక్రమం అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం పలు పూజా కార్యక్రమాల అనంతరం ఢీ,జబర్దస్,శ్రీదేవి డ్రామా కంపెనీ,సినీ ఆర్టిస్టులచే పాటకచ్చేరి జరుపనున్నారు. 19వ తేదీ ఉదయం ప్రతిష్టాంగ హనుమ న్యాస హోమాలు చేసిన పిదప కన్యాలగ్నములో ఆంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ట ధ్వజ ప్రాణప్రతిష్ఠ,తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు.

## కలకటవారిపల్లెలో వరలక్ష్మీవ్రతం

సదుం, ఆగస్టు16ప్రభాతవార్త

మండల పరిదిలోని పలు ఆలయాలలో శుక్రవారం వరలక్ష్మీవ్రతాన్ని భక్తి శ్రద్దలతోనిర్వహించారు. పలువురు తమ ఇళ్లలో కూడా వరలక్ష్మీ దేవి విగ్రహాన్ని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మగారిపల్లె పంచాయతీ కలకటవారిపల్లెలోని రామాలయంలోను, జాండ్రపేటలోని చౌడేశ్వరీదేవి ఆలయంలోను, నడిగడ్డలోను శ్రావణమాసం సందర్భంగా శ్రీవరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. అమ్మ వారిని ప్రతిష్టించి దీప దూప నైవేద్యాలను సమర్పించారు.అమ్మ వారి కథను చదివి వినిపించారు. విశేష పూజలు చేపట్టి అనంతరం తీర్థ ప్రసాదాలను వినియోగించారు. ఇళ్లలో వ్రతాలను ఆచరించిన మహిళలు పూజలు అనంతరం ముత్తైదువలకు వాయనాలు ఇచ్చి పుచ్చుకున్నారు.

## నేడు ద్విచక్రవాహనం వేలం

సదుం,ఆగస్టు16ప్రభాతవార్త

సదుం పోలీసు స్టేషన్ పరిదిలో వివిధ కేసులకు సంబందించి ఇటీవల స్వాదీనం చేసుకున్న మోటారు సైకిలును శనివారం మధ్యాహ్నం వేలం వేయనున్నట్లు ఎస్సై ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

## ఉత్తమ పురస్కారం అందుకున్న ఎంపిడిఒ ఖాదర్‌బాషా

కుప్పంరూరల్, ఆగస్టు 16 ప్రభాతవార్త



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో చూపిన ప్రతిభను గుర్తిసూ_ ప్రభుత్వం తరపున ఉత్తమ ఎంపిడిఒగా కుప్పం ఎంపిడిఒ ఖాదర్‌బాషా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ పురస్కారం రావడం తనపై బాధ్యత పెంచిందని ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత చొరవ చూపుతానని ఎంపిడిఒ తెలిపారు.

## వైభవంగా శ్రీవరలక్ష్మి వ్రతం.. మహిళలు వస్త్రం..పసుపుకుంకుమల పంపిణీ

కుప్పంరూరల్, ఆగస్టు 16 ప్రభాతవార్త

స్థానిక ఎంఎఫ్‌సి ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఆవరణలో సాయిమాతా సేవా ట్రస్ట్ జగదీష్‌బాబు అధ్వర్యం లో శుక్రవారం శ్రీ వరలక్ష్మి వ్రతాన్ని వేదబ్రహ్మశ్రీ బాలసుబ్రమణ్యం శాస్త్రి ఘన ంగా నిర్వహించారు. ఈసందర్భంగా వరలక్ష్మి వ్రతం ప్రాధాన్యతను మహిళలకు వివరించారు. అనంతరం వ్రతానికి హాజరైన నాలుగు వందలమంది మహిళలకు జగదీష్‌బాబు జాకెట్ పీసు, పసుపుకుంకుమ, గాజులను అందజేశారు.ప్రిన్సిపాల్ జ్యోతీశ్వరన్, ధరణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**రామకుప్పం :** మండలంలో మహిళలు వరలక్ష్మి వ్రతం పండగను ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లల్లో అమ్మవారిని కొలువు ఉంచి అమ్మవారికి విశేషాలంకరణ, పిండివంటలు సమర్పించి అంతా మంచి జరగాలని కోరుకున్నారు. స్థానిక శ్రీ వెంకటేశ్వరాలయం, కాశీవిశ్వేశ్వరాలయం, శ్రీ సుబ్రమణ్యస్వామి, శ్రీ గంగమ్మ ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.

## భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



శ్రీరంగరాజుపురం, ఆగస్టు 16 ప్రభాతవార్త:

మండలంలోని ఆరుమాకులపల్లెలో వెలసిన ఆరుమాను గంగమ్మ గుడిలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతంను పరిసర గ్రామాల మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు ఉదయం అమ్మవారిని వరలక్ష్మీ దేవిగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకు లు వెంకటాచలపతి అయ్యంగార్ వేదమంత్రోచ్చారణల మధ్య వరలక్ష్మీ వ్రతం నిర్వహించి భక్తులకు దారాలు, తీర్ధ ప్రసాదాలు అందజేశారు.

## ప్రజా సమస్యలపై స్పందించిన అధికార గణం

సోమల, ఆగస్టు 16, ప్రభాతవార్త



సోమల మండల పరిషత్ కార్యాలయలోని మీటింగ్ హాల్ నందు శుక్రవారం ఉదయం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపిపి ఈశ్వరయ్య అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు ప్రజా సమస్యల గురించి స్పందిస్తూ మాట్లాడుతూ చర్చించదగిన విషయం. వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ మాట్లాడుతూ వేరుశెనగ సాగు మండలంలో తగ్గుతూ వస్తుందని దీనికి కారణం అడవి పందుల బెడద, కోతులు, వన్యమృగాల దాడి కారణమన్నారు. విద్యుత్ శాఖ ఏఈ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ పత్రా పల్లి, అడుసుపల్లెల వద్ద సబ్ స్టేషన్‌లో కొత్తగా నిర్మిస్తున్నామన్నారు. నంజంపేట ఎంపిటీసీ జిన్నా మాట్లాడుతూ కుక్కలు గుంపులుగా సంచరిస్తూ ప్రజా జీవనానికి ఆటంకం కలిగిస్తున్నాయన్నారు. కందులు వైద్యాధికారి మాట్లాడుతూ డెంగ్యూ జ్వరాలు ప్రబలుతున్నాయని దోమల నివారణకు పంచాయితీ చర్యలు తీసుకోవాలని అన్నారు. తహశీల్దార్ బెన్ను రాజు మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కుసుమకుమారి, వైస్ ఎంపిపి ప్రభాకర్, ఇన్చార్జి ఎంపిడిఓ నారాయణ పలువురు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవా పురస్కారం అందుకొన్న జోసఫ్‌రాజు

చిత్తూరురూరల్, ఆగస్టు 16 ప్రభాతవార్త:



స్వాతంత్ర దినోత్సవం వేడుకల్లో సపోర్టు సంస్థ అధ్యక్షులు, నిరాశ్రయుల వసతి గృహ నిర్వాహకులు జోసఫ్‌రాజు నిరాశ్రయులకు అందిస్తున్న విశిష్ట సేవలకు జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్, వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ల చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కార పత్రాన్ని అందుకొన్నారు. ఈ సందర్భంగా జోసఫ్‌రాజు మాట్లాడుతూ ఈ అవార్డును స్పూర్తిగా తీసుకొని మరిన్ని సేవాకార్యక్రమాలు అందిస్తానని పేర్కొన్నారు. కాగా ఉత్తమ సేవా పురస్కారం అందుకొన్న జోసఫ్‌రాజుకు నగరపాలకసంస్థ కమీషనరు, మెప్మా సిబ్బంది, నిరాశ్రయుల వసతిగృహ సిబ్బంది ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## మంత్రి దృష్టికి జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల సమస్యలు

చిత్తూరురూరల్, ఆగస్టు 16 ప్రభాతవార్త:



స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరైన వైద్య, ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ యాదవ్‌ను జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల సంఘ అధ్యక్షుడు పన్నీర్‌సెల్వం తన తోటి డ్రైవర్లలతో మర్యాద పూర్వకంగా కలసి డ్రైవర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గత 23 సంవత్సరాలుగా పాతవాహ నాలతో పలు ఇబ్బందులు పడుతున్నామనీ, కొత్త వాహనాలతో పాటు డ్రైవర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. పాతవాహనాలతో వైద్యాధికారులు ప్రబలుతున్న మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, డమేరియా తదితర వ్యాధులకు సకాలంలో చికిత్స అందించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ప్రభుత్వంతో చర్చించి వెంటనే తగు చర్యలు తీసుకొంటానని హామి ఇచ్చారు.

## 1.రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి ఇద్దరి పరిస్థితి విషమం

గంగాధర నెల్లూరు 16 ఆగస్టు ప్రభాతవార్త :



మండల పరిధిలోని చిత్తూరు పుత్తూరు రోడ్డు నెల్లేపల్లి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి మరో ఇద్దరు పరిస్థితి విషమం దుర్ఘటనచోటు చేసుకుంది వివరాల్లోకి వెళితే బాలగంగన పల్లెకు చెందిన హుస్సేన్‌అబ్బాస్ 29తన కుమారై ఆరోగ్యం బాగులేకపోవడంతో చిత్తూరుకు వెళ్ల వైదం చేసుకొని అనంతరం గంగాధర నెల్లూరు మండలం వీరక నెల్లూరు గ్రామంలోజరిగే పీర్ల ఉత్సవంలో పాల్గొనడానికి హుస్సేన్‌అబ్బాస్ భార్య హాసీనా ఇద్దరు కుమారైలు శబ్బం,తంజీమలు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా నెల్లేపల్లి వద్ద ప్రమాదశాత్తు ఎదురుగా వస్తున్న కారును ఢీకొనడంతో హుస్సేన్‌అబ్బాస్‌అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడ్డ హుస్సేన్‌అబ్బాస్ భార్య ఇద్దరు కుమారైలను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అయితే మూడేళ్ల చిన్నారి శబ్బం చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెంది నట్లు కుటుంబీకులు తెలిపారు.అయితే భార్య హాసీనా 22 ఆరు నెలల చిన్నకుమారై తంజీమ పరిస్థితి కూడావిషమంగా ఉన్నట్లు సమాచారం ఈ మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఏడుమంది రైతులకు పంటనష్టపరిహారం అందజేత

కుప్పం, ఆగస్టు 16 ప్రభాతవార్త



కుప్పం నియోజకవర్గంలో ఏనుగుల దాడుల్లో పంటలు కోల్పోయిన ఏడు మంది రైతులకు అటవీశాఖ తరపున ఎనభై వేల రూపాయల ఆర్థికసాయాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ పంపిణీ చేశారు. రైతులకు చెక్కులను అందజేశారు. ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో కడ పిడి వికాస్ మర్మత్, కుప్పం రేంజర్ జయశంకర్ పాల్గొన్నారు.

## గంగా భవానీకి రాహుకాలాభిషేకం

బోయకొండ(చౌడేపల్లి), ఆగస్టు 16 ప్రభాతవార్త



శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు రాహుకాలాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి విశేషాబి షేకం, అలంకరణగావించారు. రాహుకాల సమయంలో దంపతుల సమక్షంలో వేద పండితులచే జరిగిన అభిషేకం భక్తులను అలరించింది. అనంతరం పాత కళ్యాణకట్ట భవనం లో అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. పలమనేరుకు చెందిన నవీన్ అన్నదానానికి కూరగాయలను విరాళంగా అందించారు. ఇఒ ఉపకమీషనర్ ఏకాంబరం, ఆలయ అధికారులు, అర్చక, సిబ్బంది భక్తులకు వసతులు సమకూర్చారు.

## కర్ణాటక రోడ్డు ప్రమాదంలో చౌడపల్లి యువకుడి మృతి

చౌడపల్లి, ఆగస్టు 16 ప్రభాతవార్త



కర్ణాటర రోడ్డు ప్రమాదంలో చౌడేపల్లికి చెందిన యువకుడు మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు...పట్టణంలోని బజారువీధికి చెందిన రెడ్డెప్పాచారి కుమారుడు లోకేష్(19) కర్ణాటక రాజధాని బెంగళూరులో స్కూటర్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో ఇదే పట్టణానికి చెందిన బెస్త వెంకట్రమణ కుమారుడు పవన్‌తో కలసి గురువారం రాత్రి ద్విచక్ర వాహనంలో చౌడేపల్లికి బయలుదేరారు. మార్గ మద్యలో చిక్‌బళ్ళాపురం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో లోకేష్ అక్కడిక్కడే మృతి చెందాడు. పవన్‌కు కాలు విరిగి తీవ్ర గాయాలపాలయ్యాడు. రెడ్డెప్పాచారి, నిర్మలది వ్యవసాయ కూలీ కుటుంబం. చేతికందిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబం శోక సంద్రమైంది. కాగా మృతుడు లోకేష్ రాజనాలబండలో జరిగే తిరుణాళ్ళకు చౌడేపల్లి నుంచి కళశాలు తీసుకు వెళ్తాడు.

## ఘనంగా శ్రీవరలక్ష్మీదేవి వ్రతం

పుంగనూరు,ఆగస్టు 16 ప్రభాతవార్త :



పండుగలకు ఆలవాలమైన శ్రావణమాసంలో శుక్రవారం నాడు ప్రజలు శ్రీవరలక్ష్మీదేవివ్రతాన్నిభక్తి శ్రద్దలతో వైభవంగా నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా పట్టణంలోని వైష్ణవాలయాలలో శ్రీదేవిని కొలువుచేసి ఆమెకు వ్రతాన్ని నిర్వహించారు. శ్రీవైష్ణవసాంప్రదాయంలో పాంచరాత్రాగమనంలో శ్రీవరలక్ష్మీదేవి వ్రతాన్ని నిర్వహించుకునే అన్నిరకాల విధానాలు సామాజిక మాధ్యమంలో అందుబాటులోనికి వచ్చి ఉండడంతో కులాలతో సంబంధం లేకుండా అధికశాతం కుటుంబాల ప్రజలు తమ ఇండ్లలో శ్రీవరలక్ష్మి అమ్మవారిని నిలిపి పూజలు చేశారు. అంతేకాకుండా వ్రతానికి ముత్తైదువలను పిలిచి వారికి తమ శక్త్యానుసారం తాంబూలవస్త్రప్రసాదాలను అందచేసివారి ఆశీస్సు లకు పాత్రులయ్యారు. పట్టణంలోని శ్రీకళ్యాణవేంకటేశ్వరాలయంలో అర్చకులు అమ్మవారి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీమాణిక్యవరదరాజస్వామివారి ఆలయం, వనమలదిన్నె శ్రీలక్ష్మీనర్సింహస్వామివార్ల ఆలయాల వద్ద శ్రీవరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు.

## రైతుల పంటలు విధిగా నమోదు చేయాలి

కుప్పంరూరల్, ఆగస్టు 16 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులు సాగు చేస్తున్న పంటలను వీఆర్వోలు, వీఎఏలు తప్పనిసరిగా ఇ - పంటలో నమోదు చేయాలని తహశీల్దార్ చిట్టిబాబు, ఎఓ అమృతవల్లి కోరారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. వీఆర్వోలు, వీఎఏలు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులు ఈ సీజనులో ఏయే పంటలు ఏమేర విస్తీర్ణంలో సాగు చేశారు అనే విషయాల్లో ఆన్‌లైన్‌లో ఇ-ప ంటలో విధిగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఎఏలు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## శాస్త్రవేత్తలకు అభినందనలు

సూళ్లూరుపేట, ఆగస్టు 16 ప్రభాతవార్త



ప్రపంచ అంతరిక్ష చరిత్రలో సువర్ణ అధ్యాయాన్ని కొనసాగిస్తున్న భారత అంతరిక్ష శాస్త్రవేత్తల విజయ పరంపరకు నిదర్శనంగా ఎస్ఎస్ఎల్‌వి డి3 రాకెట్ విజయం సాధించిందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అభినందనలు తెలిపారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారతదేశ పురోభివృద్ధికి ఇస్రో ఎంతో కృషి చేస్తోందన్నారు. ఇస్రో మైలు రాళ్లలో త్వరలోనే చేపట్టనున్న గగన్‌యాన్ ప్రయోగం విజయవంతం కావాలని ఆమె ఆకాంక్షించారు. ప్రయోగ విజయానికి కృషి చేసిన శాస్త్రవేత్తలకు, ఇస్రో సిబ్బందికి ఆమె అభినందనలు తెలిపారు. అలాగే మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, పట్టణ టిడిపి అధ్యక్షుడు ఆకుతోట రమేష్, కార్యదర్శి ఎజి కిషోర్, బిసి నాయకులు ఎస్ఎన్ మునిరాజా, టిడిపి బిసిసెల్ సీనియర్ నాయకులు పుట్టు రమణమూర్తి తదితరులు శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

## రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్‌చే దివ్యాంగునికి వీల్ చైర్ అందజేత

చిల్లకూరు, ఆగస్టు 16, ప్రభాతవార్త



చిల్లకూరు మండలంలోని రెట్టపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న మంద రమేష్ అనే దివ్యాంగునికి రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు రాజనేని శ్రీనివాసులు నాయుడు దాతృత్వంతో వీల్ చైర్‌ను ట్రస్ట్ సభ్యులైన బాబు, పవన్‌ల ద్వారా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు రాజనేని శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ ప్రమాదంలో గాయపడి రెండు కాళ్ళు నడవలేని స్థితిలో ఉన్న మందా రమేష్ అనే దివ్యాంగుడికి వీల్ చైర్ అందజేయడం జరిగిందని, ఆపదలో ఉన్న పేద వారిని ఆదుకోవడంలో రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఎల్లవేళలా రామానారాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలిపారు.

## ఉచిత మెగా వైద్య శిభిరాన్ని సద్వినియోగం చేసుకోండి



గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

గూడూరు, ఆగస్టు 16, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలోని చిల్లకూరు శేషమ్మ మున్సిపల్ హై స్కూల్ నందు ఆదివారం చెన్నైకి చెందిన కెవిటి హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిభిరాన్ని నిర్వహిస్తున్నట్లు గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేస్తారన్నారు. గూడూరు నియోజకవర్గంలోని ప్రజలు పాల్గొని ఉచిత వైద్య శిభిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఘనంగా వరలక్ష్మి వ్రతం

చిల్లకూరు, ఆగస్టు 16, ప్రభాతవార్త



మండల పరిధిలోని తూర్పు కనుపూర్ గ్రామంలో వెలసి ఉన్న శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో వరలక్ష్మి వ్రతం శ్రావణ శుక్రవారం సందర్భంగా ముత్యాలమ్మ అమ్మవారు బంగారు చీర అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం గ్రామ నలుమూలల నుండి మహిళలు పెద్ద ఎత్తున ఆలయం వద్దకు చేరుకుని వరలక్ష్మి వ్రతం పూజ, కుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ లోపల ప్రత్యేక పూల అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమానికి వచ్చిన భక్తులకు గుమ్మడిపూడి గ్రామానికి చెందిన తోట కృష్ణయ్య ఉభయకర్తగా వ్యవహరించారు. అదే విధంగా కలవకొండ గ్రామంలో కొండపై వెళ్తున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కూడా వరలక్ష్మి వ్రతం పూజలు ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కకుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ సిద్దారెడ్డి ఇంద్రసేనా రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు దువూరు చంద్రారెడ్డి, ఈవోలు కె నవీన్ కుమార్, తాతా శ్రీనివాస్‌లు దగ్గరుండి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది. అనంతరం భక్తులకి తీర్థప్రసాదాలు అందించారు. అన్నదాన కార్యక్రమం వరగలి గ్రామానికి చెందిన మాజీ ఏఎంసి చైర్మన్ ఎరటపల్లి జానకి రామ్ రెడ్డి, శ్యామల వ్యవహరించారు.

## ఫల సరుకులు పంపిణీ

గూడూరు, ఆగస్టు 16, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని కమ్యూనిటీ హాల్‌లో పేదలకు వైజెపి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు ఫల సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ క్లబ్ రీజినల్ చైర్మన్ ఆర్‌వి రావు మాట్లాడుతూ మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ కార్యక్రమం డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. ఈ మీటింగ్‌లో ముఖ్యమైన విషయములు సేవా కార్యక్రమాల పై సలహాలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజెపి అధ్యక్షుడు మనోజ్ కుమార్, పట్టణ అధ్యక్షుడు సుబ్రమణ్యం యాదవ్, సెక్రటరీ శీనయ్య, ట్రెజరర్ గోపినాథ్ రెడ్డి, పర్మనెంట్ ప్రాజెక్ట్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, మురళి నాయుడు, మురళిరాజు, ఎస్ఎల్ఎన్ స్వామి, రవీంద్ర రెడ్డి, సుధాకర్, ఉప్పల సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఆనంను సన్మానించిన పాపా రెడ్డి

వాకాడు, ఆగస్టు 16, ప్రభాతవార్త



రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని శుక్రవారం తన నివాసంలో గూడూరు నియోజకవర్గ బిజెపి కన్వీనర్ శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆనం రామనారాయణ రెడ్డితో నియోజకవర్గంలోని పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పలు అంశాలు ఇరువురు చర్చించుకున్నారు. నియోజవర్గ పరిధిలోని పాత బడిన దేవాలయాలు వాటి అభివృద్ధి పై దృష్టి సారించాలని మంత్రికి పాపా రెడ్డి విన్నవించారు. త్వరలో తప్పకుండా అన్ని సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి తెలిపారని పురుషోత్తం రెడ్డి తెలిపారు.

## ముస్లీంల అభ్యున్నతికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం



ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, ఆగస్టు 16, ప్రభాతవార్త

ముస్లీంల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. బజార్ వీధిలోని పీర్ల చావిడి స్థలంలో నూతనంగా నిర్మించే షాపింగ్ కాంప్లెక్స్‌కు ఎమ్మెల్యే రామకృష్ణ భూమి పూజ చేశారు. వక్ఫ్ బోర్డ్ ఆస్తుల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. పీర్ల చావిడి స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడం వల్ల స్థలం ఆక్రమణ గురికాదని తెలిపారు. ముస్లీం సోదరుల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సంఘం అధ్యక్షులు గౌస్ భాషా, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వర రావు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు గంగాధర్, మాజీ కౌన్సిలర్ విశ్వనాథం, జనసేన నాయకులు తోట కృష్ణయ్య, అనిల్, నాయకులు ఆనంద్, నరసింహులు, సుధాకర్, మస్తాన్, భాష తదితరులు ఉన్నారు.

## ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరిస్తా...

దక్కిలి,ఆగస్టు 16,ప్రభాతవార్తః



మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని తహసీల్దార్ ఎం శ్రీనివాసులు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌ను ఎంఈఓ ఎప్ జిల్లా కార్యదర్శి దూడల పెంచలయ్య,చిరంజీవి,సురేష్, ఏపీ ప్రజా సంఘాల నాయకులు గద్దల మునెయ్య,నన్నెం మునెయ్య,రవిలు వేర్వేరుగా మర్యాద పూర్వకంగా తహసీల్దార్‌ను కలిసి శాలువతో సన్మానించారు.ఈసందర్భంగా వారు మండలంలోని నెలనొని ఉన్న పలు సమస్యలను ఆయనుకు తెలియజేశారు.ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పేదల సమస్యలను తమ కు తెలియజేస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.మండలంలో 16 గ్రామాల్లో సీజేఎఫ్ఎస్ భూములను డీకేటీ భూములుగా మార్చేందుకు అవసరమైన చర్యలు త్వరలో తీసుకుంటామన్నారు.అంతే గాకా పేదలు ఎన్నో ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న భూములకుఅసైన్‌మెంట్ పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.ఇక ఎక్కడైనా పలు సంవత్సరాలు నుంచి గిరిజనులు అటవీ భూములను

## కోట ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన పవన్‌కుమార్

కోట, ఆగస్టు 16 ప్రభాతవార్త



కోట పోలీసుస్టేషన్ ఎస్ఐగా పవన్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరిం చారు. వాకాడు పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ పవన్‌కు మార్‌ను కోటకు నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ నాగబాబును వాకాడుకు బదిలీ చేసినట్లు సమాచారం. అయితే ఇంకా అధికారికంగా ఉత్తర్వులు రాలేదు. కోటలో పనిచేసిన ఎస్ఐ నాగబాబు గత ఎన్నికలకు ముందు నుంచి కోటలో పనిచేస్తున్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన ఒక వర్గం వారు పట్టుబట్టి ఎస్ఐ నాగబాబును బదిలీ చేయించినట్లు తెలుస్తోంది.

## నూతన ఎస్ఐ ట్రాఫిక్‌పై దృష్టి పెట్టాలి

కోట, ఆగస్టు 16 ప్రభాతవార్త

కోట పోలీసుస్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ పవన్‌కుమార్ మండలంలోని విద్యానగర్, కోట ప్రాంతాల్లో ట్రాఫిక్‌పై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతిరోజు సాయంత్రం, ఉదయం వేళల్లో కోట గాంధీబొమ్మ సెంటరు నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు షాపుల వద్ద రోడ్లపైనే ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. అదే క్రమంలో విద్యానగర్‌లో విద్యాసంస్థలు ఉండటంతో అక్కడ కూడా రోడ్లపైనే ఆటోలు, లారీలు అడ్డదిడ్డంగా నిలిపేస్తుండటంతో విద్యార్థులు, ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. ఈ రెండు ప్రాంతాలపై ఎస్ఐ పవన్‌కుమార్ ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే ప్రకాశం కాలనీలో వివిధ మతాలు, కులాల వారు ఉండటంతో తరచూ దొంగతనాలు జరుగుతున్నాయి. ఈ కాలనీల్లో కార్డెన్ సెర్చ్ చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి నిత్యం కొత్త వ్యక్తులు రాత్రి వేళల్లో వచ్చి వెళుతున్నారని కాలనీవాసులు గుర్తు చేస్తున్నారు.

## కోటలో వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

కోట, ఆగస్టు 16 ప్రభాతవార్త

కోట మండలంలో వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శుక్రవారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రావణ మాసం శుక్ల పక్షం పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారాన్ని వరలక్ష్మీ వ్రతంగా జరుపుకుంటారు. శ్రావణ మాసంలో ఈ పండుగ ఎంతో విశిష్టమైనది. వరాలిచ్చే వరలక్ష్మిని ఇంటింటా పూజించారు. అష్టలక్ష్ములలో వరలక్ష్మిదేవికి ప్రత్యేకత ఉంది. శ్రావణ మాసంలో ఈ వ్రతం చేస్తే విశేషంగా ఫలితాలు ఉంటాయని మహిళల ఆశాభావం. సర్వమంగళ సంప్రాప్తి కోసం సకల అభిష్టాలు కోసం నిత్య సుమంగళిగా వర్ధిల్లాలని మహిళలు ఆలయాల్లో పూజలు చేశారు.

## సచివాలయాల్లో ఉద్యోగులు సర్దుబాటు

కోట, ఆగస్టు 16 ప్రభాతవార్త

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటయిన గ్రామ సచివాలయాల్లో పలుచోట్ల సిబ్బంది ఎక్కువగా ఉంటే మరికొన్ని చోట్ల ప్రజల అవసరాలకు సరిపడా లేరు. ఇంకొన్ని చోట్ల సిబ్బంది ఉన్నా పని ఉండటం లేదు. సచివాలయ సిబ్బందికి తగిన పని ఉండకపోవడంతో ఖాళీగా కూర్చుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని ప్రధానమైన శాఖలకు సంబంధిత ఉద్యోగులను సచివాలయాల్లో ఉంచే అంశాన్ని ప్రభుత్వం ఆలోచిస్తోంది. కొందరు ఉద్యోగులను అనుబంధ శాఖలకు పంపే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. నెలల తరబడి కొందరు సర్వేయర్లకు పని ఉండటం లేదు. గ్రామాల్లోని కొందరికి నెలలో ఒకరోజు కూడా పని ఉండటం లేదు. ఇదే సమయంలో సర్వే ల్యాండ్ శాఖలో సిబ్బంది కొరత ఉంది. అన్ని సచివాలయాల్లో పశుసంవర్ధక సహాయకులు ఉన్నా వారికి పనిలేదు. విద్యాశాఖ సహాయకుల సేవలు పరిమితంగానే ఉన్నాయి. ఇలాంటి సిబ్బందిపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇతర శాఖలకు పంపించాల్సి న వివరాలను ఇప్పటికే అధికారులు సేకరించారు. ఆ మేరకు సచివాలయాల్లోని ఉద్యోగులు మార్పులు చేసే దిశగా ఉన్నతాధికారులు ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది.

## ఘనంగా వరలక్ష్మి వ్రతం పూజలు

వెంకటగిరి, ఆగస్టు 16, ప్రభాతవార్త

మండలంలోని ఆలయాలు, ఇళ్లలో ఘనంగా వరలక్ష్మి వ్రతం, పూజలు భక్తులు నిర్వహించారు. పోలేరమ్మ కామాక్షమ్మ ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయాల్లో పొటెత్తారు. ఘనంగా వరలక్ష్మి వ్రతం పూజలను నిర్వహించారు.

## సెంట్రల్ లైటింగ్ ప్రారంభించిన ఎమ్మెల్యే రామకృష్ణ

వెంకటగిరి, ఆగస్టు 16, ప్రభాతవార్త

పట్టణంలోని రైల్వే స్టేషన్ వరకు ఏర్పాటు చేసిన రంగురంగుల సెంట్రల్ లైటింగ్ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రారంభించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పునుగోటి సుబ్రమణ్యం, మాజీ కౌన్సిలర్ విశ్వనాథంలు సొంత నిధులతో ఏర్పాటు చేసిన లైటింగ్ ఎమ్మెల్యే ప్రారంభించారు. మూడు రంగులతో ఉన్న సెంట్రల్ లైటింగ్‌ను వారు విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేయించారు. మాజీ ఎమ్మెల్యే వివిఆర్కె యాచేంద్ర విగ్రహం కూడలి నుండి రైల్వే స్టేషన్ వరకు మూడు రంగుల విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. సెప్టెంబర్ నెల 25, 26 తేదీల్లో జరగబోవు గ్రామ శక్తి పోలేరమ్మ జాతర పట్టణంలో విద్యుత్ కాంతుల విరాజిల్లే విధంగా చేస్తానని ఆయన తెలిపారు.

## విలువలతో కూడుకున్న రాజకీయాలు కనుమరుగయ్యాయి:

శ్రీకాళహస్తి,ఆగస్టు 16 ప్రభాతవార్త



భారత దేశంలో అటల్‌బిహారి వాజ్‌పేయి విలువలతో కూడుకున్న రాజకీయం నిర్వహించారని నేడు రంగులు మారే రాజకీయం చోటు చేసుకుందని ఓబిసి బిజెపి జాతీయ అధ్యక్షుడు రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు.శ్రీకాళహస్తిలో రాష్ట్ర బిజెపి నాయకుడు కోలా ఆనంద్ కుమార్‌సారథ్యంలో మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతి కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నాడు వాజ్‌పేయి ఒక్క ఓటుతో తమ ప్రభుత్వం పడిపోతుందని తెలిసి కూడా రాజకీయాల్లో విలువలను పాటించారన్నారు.కానీ నేడు ఆ పరిస్థితి లేదన్నారు.పాకిస్థాన్ లాంటి శత్రుదేశాల గుండెల్లో నిద్రించారన్నారు. నేటి రాజకీయ పరిస్తితి గమనిస్తుంటే ఊసరవెల్లి కూడా సిగ్గుతో తలదించుకునేటట్లు మారిందన్నారు. నేడు రాజకీయాల్లో కులాలు,మతాలు, వర్గాలు, ప్రాంతీయ తత్వాన్ని రెచ్చగొడుతూ పబ్బంగడుపుకుంటున్నారని ధ్వజమెత్తారు.అటల్‌జీ ఆశయ సాధనకు ప్రపంచ దేశాల్లో భారత్‌ను నెంబర్ వన్‌గా చేయటానికి ప్రధాని నరేంద్రమోదీ పరుగులు తీస్తుంటే కొన్ని ప్రాంతీయ పార్టీలు,కాంగ్రెస్ శత్రుదేశాలైన చైనాకుమ ద్దతుగా మాట్లాడటం దారుణమన్నారు.బంగ్లాదేశ్‌ను ఇస్లామిక్ దేశంగా మార్చటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ తీరు బాధాకరమన్నారు.దేశ సమగ్రతకు ముప్పు తెచ్చి తమ పబ్బం గడుపుకొనుటకు ప్రయత్నించటం బాధాకరమన్నారు.ఈ ప్రమాదకర పరిస్థితిని దేశాన్ని రక్షించుటకు ప్రదాని నరేంద్రమోదీ ప్రణాళికలు అద్భుతమన్నారు. 2047 విజన్ సాధనకు ఆయన చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు.ఈ కార్యక్రమాల్లో కోలా ఆనంద్‌కుమార్,జివి అమర్‌నాథ్,సుబ్రమణ్యం రెడ్డి, గరికపాటి రమేష్, కండ్రిగ ఉమ,ఉమాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఛటర్జీకి ఉత్తమ ప్రశంసాపత్రం



.తొట్టంబేడు, ఆగస్టు 16 ప్రభాతవార్త

78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రతి ఏడాది జిల్లా కలెక్టరేట్ నుంచి ఉత్తమ ప్రతిభ కనపర చిన వివిధ శాఖల అధికారులకు ప్రశంసాపత్రాలను అందించి సత్కరించడం ఆనవాయితీ, ఈనేపధ్యంలో పట్టణంలో టుటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్(పిసి'2052)గా పనిచేస్తున్న చట్టర్జీ పలు కేసులను ఛేదించడంలో ప్రతిభ చూపడంతో పాటు ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించడంలో గుర్తింపు తెచ్చుకున్నాడు. ఈసందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనంరామనారాయణరెడ్డి, ఎంఎల్‌ఏ ఆరణిశ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ల చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈసందర్భంగా టుటౌన్ సిఐ రారాజుతో పాటు పలువురు సహచరులు అభినందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి డాక్టర్ సిపాయిసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్దార్‌కు ఘనసత్కారం

.తొట్టంబేడు, ఆగస్టు 16 ప్రభాతవార్త



తొట్టంబేడు మండల నూతన తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన మధుసూధనరావును ఏపి పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, శ్రీకాళహస్తి ఎన్జీవో తాలూకా అధ్యక్షుడు సి.చెంచురత్నంయాదవ్ పుష్పగుచ్ఛం అందించిదు శ్శాలువతో సత్కరించారు. ఈసందర్భంగా చెంచురత్నం మాట్లాడుతూ రెవెన్యూశాఖలో పలు సమస్యలు ఉన్నాయని అన్నదాతలను కార్యాలయం చుట్టు తిప్పించుకోకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహశీల్దార్‌ను కోరారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ మధుసూధనరావు మాట్లాడుతూ అన్నదాతల సమస్యలను పరిష్కరిస్తామని ప్రతిసోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని ఇందులో అన్నదాతలు, ఇతర సమస్యలు వినతిపత్రం అందిస్తే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో చెంచురత్నంయాదవ్‌తో డిప్యుటీ తహశీల్దార్ సుధీర్‌రెడ్డి, పంచాయతీరాజ్ కార్యాలయ సిబ్బంది గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ కులస్తులకు అన్ని విధాల సహకారం అందిస్తాం



ఎంఎల్‌ఏ బొజ్జలసుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఆగస్టు 16 ప్రభాతవార్త

ముదిరాజ్ కులస్తులను అన్ని విధాల ఆదుకుంటామని వారికి భవననిర్మాణానికి స్థలం కేటాయించి నిర్మాణానికి సహకారం అందిస్తామని రాజకీయ పదవుల్లో అవకాశం కల్పిస్తామని ఎంఎల్‌ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి అన్నారు.శుక్రవారం పట్టణంలోని మహేష్ కళ్యాణ్‌సదన్‌లో ముదిరాజ్ అభినందన సభను నిర్వహించారు. ఈసందర్భంగా నియోజకవర్గ పరిధిలో 2023-24 విద్యాసంవత్సరంలో 500పైగా మార్కులు సాధించిన సుమారు 100మంది ముదిరాజ్ విద్యార్థినీ విద్యార్థులను ఘనంగా సత్కరించి ప్రోత్సాహకాలు అందించడంతో పాటు మెమొంటోలు అందించి సత్కరించారు. తాను సాధించిన విజయంలో ముదిరాజ్‌లు అందించిన సహకారం ఎన్నటికీ మరచిపోలేనని ముదిరాజ్‌లను అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని భవననిర్మాణం కోసం త్వరలోనే స్థలాన్ని కేటాయించి వారిని రాజకీయ పరంగా, ఆర్ధికపరంగా అభివృద్ది చేస్తామన్నారు. విద్యావంతులైన యువతీయువకులకు చుట్టుపక్కల పరిశ్రమల్లో ఉత్తీర్ణతకు తగినట్లు ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎంఎల్‌ఏ హామీ ఇచ్చారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ముదిరాజ్‌ల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం ప్రతిభకలిగిన విద్యార్థులను సత్కరించి అభినందించారు. నేడు విద్య ఒక్కటే అందరినీ ముందంజలో తీసుకెళ్తుందన్నారు. కంప్యూటర్ ప్రపంచంలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలని తల్లిదండ్రులు కూడా తమ బిడ్డలను ఒత్తిడికి లోనుకాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ అధ్యక్షులు వైవి.రమణయ్య, యువత అధ్యక్షులు ఆకుల గురుమూర్తి, పట్టణ అధ్యక్షులు కోనేటి అయ్యప్ప, గౌరవాధ్యక్షులు పిళ్ళారిబత్తినయ్య, చిట్టేటి చిన్నా, పి.సుధాకర్, జి.రాజేంద్ర, ఎస్.అంకయ్య, పి.తిరుపాల్, కె.నాగరాజు, గౌరవసలహాదారు తోటకూర కోటేశ్వరరావు, పి.అశ్వద్దామ, బోనుపల్లిరా జేంద్ర, సంఘప్రధాన కార్యదర్శి ఏ.వెంకటేశ్వర్లు, బొజ్జగోవిందస్వామి, మహిళా అధ్యక్షురాలు పిళ్ళారి అమరావతి, కోనేటి నాగలక్ష్మి, యువత అధ్యక్షురాలు ఆకులసునీత, అమ్ములు, ప్రచార కార్యదర్శి ఆర్.సుబ్రమణ్యం, సంయుక్త కార్యదర్శి జి.రాజ, ఎస్.సతీష్, సురేంద్ర, జి.కోటి, దేసయ్య, ఎస్వీ యూనివర్సిటీ మాజీ చాన్సలర్,టిఎన్‌టియుసి పార్లమెంటు అధ్యక్షులు జయరాంముదిరాజ్ పాల్గొన్నారు.

## రూ.28లక్షలతో పాలకోవ తయారి భవనం

### లాభాల బాటలో పాలసరఫరా సంఘం, చైర్మెన్ మధుసూధననాయుడు

శ్రీకాళహస్తి,ఆగస్టు 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పాడి పరిశ్రమను అభివృద్ధి పరచుటకు ప్రణాళికలు రూపొందించుకొని అమలు చేస్తున్నట్లు చైర్మెన్ మునగాల మధుసూధననాయుడు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఒరెండేళ్ళుగా సంఘాన్ని లాభాల బాటలో నడిపిస్తూ ప్రపంచ ప్రసిద్ధి చెందుతున్న 'శ్రీకాళహస్తి కోవ' తయారికి ప్రత్యేకంగా రూ.28లక్షలతో భవనాన్ని నిర్మిస్తున్నామని వివరించారు.మూడేళ్లగా వరుసగా కో ఆపరేటివ్ సొసైటీ లాభాల దిశగా సాగుతుందని వివరించారు.ఓ వైపు సంస్థ అభివృద్ధి, మరో వైపు పాడిరైతుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నామన్నారు. గత ఏడాది సంస్థ సాధించిన లాభాల్లో పాడి రైతులకు రూ.65లక్షలు బోనస్ అందించామన్నారు.అలాగే సిబ్బందికి రూ.15లక్షలు అందించామన్నారు. ఈ ఏడాది రైతులకు రూ.55లక్షలు బోనస్ అందించామన్నారు. ప్రతి ఏడాది రూ.80లక్షలు సాధిస్తున్నామన్నారు. కాగా పాలకోవ తయారికి ప్రత్యేక భవనం నిర్మాణాన్ని రూ.28లక్షలతో పూర్తి చేసినట్లు వివరించారు. చుట్టుపక్కల గ్రామల నుంచి సుమారు 8వేల లీటర్ల పాలను సేకరిస్తున్నామని ఇందులో సుమారు 3వేల లీటర్ల పాలు బయట ప్రవైటు సంస్థలకు అందిస్తున్నామన్నారు. ప్రైవేటు సంస్థలు లీటర్‌కు రూ.32లుచెల్లిస్తున్నారని వివరించారు.మార్కెటింగ్‌కు సంబంధించి సమగ్రంగా పరిశీలిస్తున్నట్లు మధుసూధననాయుడు వివరించారు.ప్రైవేటు సంస్థలకు తక్కువ ధరలకు విక్రయిస్తున్న పాలను పట్టణంలోనే మార్కెటింగ్ చేస్తే ఇంకా లాభాలు అధికంగా వస్తాయని వివరించారు. ఓ వైపు సంస్థను లాభాల బాటలో నడుపుతూ పాడి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించుటకు ప్రయత్నిస్తున్నామన్నారు. మిగులు పాలతో కోవా, ఐస్‌క్రీములు తయారు చేసి విక్రయిస్తున్నామని వివరించారు. ఇటీవల ఈ సమస్యలను శాసనసభ్యులు సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా ఆయన కేంద్రం నుంచి నిధులు సాధిస్తామని భరోసా ఇచ్చారని అంతేకాకుండా ఇంకా సంస్థ అభివృద్ధికి దేవస్థానంతో చర్చించిన మీదట దేవుని ప్రసాదంగా కోవాను అందించుటకు అందిస్తే భక్తులకు ఓ కొత్తదనం సంస్థకు లాభాలు వస్తాయని వివరించారు.తాము బాధ్యతలు చేపట్టిన తరువాత గణనీయంగా లాభాలు వస్తున్నాయని వివరించారు

## సూర్యప్రభవాహనంపై నీలకంఠేశ్వర స్వామి దర్శనం

శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలో ప్రారంభమైన నీలకంఠేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి సూర్యప్రభవాహనంపై స్వామి అమ్మవార్లు దర్శనమిచ్చారు. ఇక్కడి బ్రహ్మోత్సవాల్లో ఉదయం ఓ వాహనం,రాత్రి మరో వాహనంపై భక్తులకు దర్శనమివ్వటం ఆనవాయితి ఈ నేపధ్యంలో శుక్రవారం ఉత్సవాల్లో భాగంగా రాత్రి స్వామి అమ్మవార్లు సూర్యప్రభవాహనంపై ప్రతిష్టించి గ్రామోత్సవం జరిపారు. ఆలయ అర్చకులు జనార్ధన్‌శర్మ స్వామి అమ్మవార్లకు హారతులిస్తూ ముందుకు సాగారు. ఉత్సవంతో పాటు దామోదరం, దుర్గా ప్రసాద్, గ్రామ పెద్ద నీలకంఠారెడ్డిలు పాల్గొన్నారు.

## యోగరత్న అవార్డు అందుకున్న సుజాత

శ్రీకాళహస్తి, ఆగస్టు 16 ప్రభాతవార్త



తమిళనాడు ఇండియన్ యోగ అసోసియేషన్ ఆధ్వర్యంలో దక్షిణభారతదేశంలోని 18వ యోగా ఛాంపియన్ షిప్ కాంపిటీషన్ తమిళనాడులోని గుమ్మిడిపూడిలో కైరాయి యోగా విద్యాపీఠంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాలహస్తి వాస్తు వివరాలు యోగా మాస్టర్ సుజాత యోగరత్న అవార్డులు అందించారు. ఎంతో మందికి శిక్షణ ఇస్తున్న విద్యార్థులను యోగాలో ఉత్తమ ప్రతిభ కనపరిచే విధంగా తయారు చేస్తున్న సందర్భంగా ఈఅవార్డును సుజాతకు అందించడం జరిగిందని సంస్థలు తెలిపారు.

## రాస్ విజ్ఞాన కేంద్రంలో కృషి విజ్ఞాన కేంద్రాల స్వర్ణోత్సవ వేడుకలు



**రేణిగుంట, ఆగస్టు 16 ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా 50 సంవత్సరాల క్రితం ప్రారంభించబడిన రాస్ కృషి విజ్ఞాన కేంద్రాల స్వర్ణోత్సవ వేడుకలు కొత్త ఢిల్లీ వ్యవసాయ పరిశోధనా మండలి ఆదేశాల మేరకు రేణిగుంట మండల చైతన్యపురం రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాస్ చైర్మన్ వెంకటరత్నం, తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహసంచాలకులు డా. వి.సుమతి, రాస్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు రాజశేఖర్‌నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాస్ కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాసులు మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా కృషి విజ్ఞాన కేంద్రాలు రైతులకు చేస్తున్న సేవలను వివరించారు. రైతులు లాభపడడానికి ప్రయోగాత్మకంగా నిరూపించబడిన వ్యవసాయ పద్ధతులను, కొత్త వంగడాల గురించి తెలిపారు. పెరిటి తోటల పెంపకం, సహజ సిద్ధ ఎరువుల తయారీ, కోడి పిల్లల పెంపకం, డ్రోన్ల ద్వారా ఎరువులు చల్లడం, పురుగుల మందు పిచికారిలపై విసిదీకరించారు. అనంతరం ముఖ్య అతిథులు విజ్ఞాన కేంద్రం రూపొందించిన ప్రచురణల పుస్తకాలను ఆవిష్కరించారు. రైతులకు వనరాజ కోడి పిల్లలు, మొబైల్ అజోల్ల యూనిట్స్, సంపంగి విత్తనాలు రూమ్ హీటర్లు, ఎరువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాస్ కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు శ్రీలత, పద్మజ, సుధాకర్, దివ్య, రాముకుమార్, వివిధ మండలాల నుంచి వచ్చిన రైతులు, వ్యవసాయ కృషి విజ్ఞాన కేంద్ర విద్యార్థులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలను పరిరక్షించడమే ప్రధాన అజెండా - డీఎస్పీ వెంకటాద్రి



**రేణిగుంట, ఆగస్టు 16 ప్రభాతవార్త:** శాంతిభద్రతలను పరిరక్షించడమే తన ప్రధాన అజెండా అని రేణిగుంట డీఎస్పీ వెంకటాద్రి అన్నారు. 1991లో ఆయన ఎస్ఐగా విధుల్లో చేరారు. కడప, కర్నూలు జిల్లాలో పని చేశారు. 2002లో సీఐగా ప్రమోషన్ పొందారు. ఎన్నో చోట్ల పని చేసి అధికారుల మన్ననలు పొందారు. 2013లో డీఎస్పీగాపదోన్నతి లభించింది. ఎన్ఐఏ(నేషనల్ ఇన్విసిగేషన్‌ఏజెన్సీ)లో పని చేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయనను సేవలకు ప్రతిఫలంగా 2018లో అతి ప్రతిష్టాత్మకమైన రాష్ట్రపతి అవార్డు లభించింది. ఎన్నికల విదుల నిర్వహణలో భాగంగా ఎన్నికల కమిషన్ ఆయనను తిరుపతికి బదిలీచేసింది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తిరుపతి ఎస్‌బీలోపని చేస్తున్న ఆయనను రేణిగుంటకు బదిలీ చేశారు. ఆయన ప్రభాతవార్త ప్రతినిధితో మాట్లాడుతూ బాధితులకు ఎప్పుడు అందుబాటులోఉంటానన్నారు. ప్రభుత్వం జీతం ఇస్తున్నది ప్రజలకు సేవ చేయడానికి అని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చట్టబద్ధంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవ చేస్తామన్నారు. ప్రోటోకాల్ బాధ్యత ఉన్నప్పటికీ ఆ బాధ్యతతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ఎలాంటి సమస్య వచ్చినా బాధితులు ధైర్యంగా తనను కలవచ్చన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ట్రాఫిక్‌పై దృష్టి సారించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

## రేపుతిరుపతిలో సరిగమప అడిషన్స్

**తిరుపతిటౌన్, ఆగస్ట్ 16ప్రభాతవార్త:**




సరిగమప 16వ సీజన్ అడిషన్స్ 18వతేదీ ఆదివారం తిరుపతిలో బాలాజీకాలనీ రేస్ ఇన్‌స్టిట్యూట్ కల్యాణిజ్యువలరీ వెనుక పోటీలు జరుగుతాయని జీ తెలుగు ప్రతినిధి ప్రసాద్‌గుప్త తెలిపారు. సరిగమప నిర్వహించిన 15 అడిషన్స్‌లో గాయనీగాయకులు ఎంతోమంది ప్రేక్షకులకు జీ తెలుగుపరిచయం చేసిందన్నారు. తెలుగురాష్ట్రాల్లో విస్తృతంగా అడిషన్స్ నిర్వహిస్తోందని, యువతలో దాగివున్న ప్రతిభను వెలికితీసి ప్రోత్సహిస్తూ మట్టిలోని మాణిక్యాలను వెలికితీసేందుకు 18వతేదీ తిరుపతిలో జరిగే జీ తెలుగు 16వ అడిషన్స్‌కు ఆసక్తిగల వారు 15-30ఏళ్లలోపు వాళ్ళు 9154670067 నంబర్‌కు కాల్‌చేసి సంప్రదించాలని కోరారు. జీ తెలుగు అందిస్తున్న ఈ అవకాశం మిస్‌చేయవద్దని, ఔత్సాహికులు ఈనెల 30వరకు డిజిటల్ అడిషన్స్ ద్వారా అవకాశంపొందవచ్చన్నారు. పాట పాడిన తమ వీడియోలను 9154670067కు వాట్సాప్‌కుగానీ, జెటిసరిగమప అట్‌దిరేట్‌ఆఫ్ జీ.కామ్ మెయిల్‌ద్వారా పంపవచ్చన్నారు.

## గాజుల అలంకరణలో గంగమ్మ దర్శనం

**తిరుపతిటౌన్,ఆగస్ట్ 16ప్రభాతవార్త:**



శ్రావణమాసం శుక్రవారం వరలక్ష్మీవ్రతం సందర్భంగా తాతయ్యగుంట గంగమ్మను వజ్రవైడూర్యాలు పొదిగిన కిరీటంతో అలంకరించి, గాజుల అలంకరణలో విశేషంగా దర్శనం కల్పించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి నిత్యకైంకర్యాలు నిర్వహించి భక్తులకు దర్శనం చేయించారు. మంగళప్రదంగా గంగమ్మ ఆశీస్సులుండాలని కోరుకున్నారు.

## ఆక్రమణలు సహించం

-వెస్ట్ సిఐ రామకృష్ణ



**తిరుపతి,ఆగస్ట్ 16ప్రభాతవార్త:**

నగరంలోని ముఖ్య వ్యాపారప్రాంతాల్లో ,జనం సంచారం ఉండే రోడ్లపై ఆక్రమణలు సహించేదిలేదని వెస్ట్ సిఐ పి.రామకృష్ణ హెచ్చరించారు. వ్యాపారులు స్వచ్ఛందంగా రోడ్లపై ఆక్రమణలు తొలగించాలని కోరారు. వెస్ట్ సిఐగా రామకృష్ణ బాధ్యతలు చేపట్టారు. గాంధీరోడ్డులో వ్యాపారాల ఆక్రమణలను తొలగించారు.

## అకడమిక్ కన్సల్టెంట్ కార్యవర్గం

**తిరుపతిటౌన్, ఆగస్ట్ 16ప్రభాతవార్త:**



ఎన్డీఏ కూటమి నూతన ప్రభుత్వం ఏర్పాటుతో తిరుపతి ఎస్వీయూలో అకడమిక్ కన్సల్టెంట్ నూతన కమిటీ ఏర్పాటైంది. అధ్యక్షుడుగా డాక్టర్ ఏటుకూరి రాంబాబునాయుడు(కామర్స్), ఉపాధ్యక్షులుగా ని. రమణయ్య(సోషియాలజీ), డాక్టర్ ఎం.రవిబాబు(మానవహక్కులు),ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ అంజన్‌సింగ్(న్యాయవిభాగం), కోశాధికారిగా డాక్టర్ శరత్‌బాబు(ఫార్మసీ) ఎన్నికయ్యారు. 240మంది అకడమిక్ కన్సల్టెంట్ భేషత్ సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు.

## శివయ్య సేవలో లక్ష్మణ్

శ్రీకాళహస్తి,ఆగస్టు 16 ప్రభాతవార్త



బిజెపి ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు,రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ కుటుంబసభ్యులతో తిరుపతిజిల్లాలోని తిరుమలేశుని దర్శనానికి వచ్చారు. రాష్ట్రబిజెపి కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ అభ్యర్థన మేరకు లక్ష్మణ్ శ్రీకాళహస్తీశ్వరాలయ దర్శనానికి వచ్చారు. ఆయనకు ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద స్వాగతం ఏర్పాటు చేసారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోనిర్వహించే పూజలు, సేవల గురించి లక్ష్మణ్ అడిగి తెలుసుకున్నారు.ఆలయంలో నిర్మాణ క్రమాన్ని చూసిన ఆయన ఇలాంటి కళాఖండానికి సంబంధించి ప్రచారం చేయాల్సిన అవసరంఎంతో ఉందని అందుకు రాబోవు రోజుల్లో పర్యాటక సమాచారంలో పొందుపరచుటకు ప్రయత్నిస్తామన్నారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం తరువాత వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా కోలా ఆనంద్‌కుమార్ శ్రీకాళహస్తిలో కలంకారి కళ గురించి వివరించారు.లక్ష్మణ్‌తో పాటు భానుప్రకాష్ ఉన్నారు.స్వాగతం చెప్పిన వారిలోకోలా ఆనంద్‌కుమార్,జివి అమర్‌నాథ్,సుబ్రమణ్యం రెడ్డి, గరికపాటి రమేష్, కండ్రిగ ఉమ,ఉమాసింగ్ తదితరులు ఉన్నారు.ఏర్పాట్లను ఆలయ ఎసి మల్లికార్జున్ ప్రసాద్ పర్యవేక్షించారు.

## సంయమనం,సౌభాతృత్వాన్ని ఇస్లాం కోరుకుంటుంది

శ్రీకాళహస్తి,ఆగస్టు 16 ప్రభాతవార్త



ఇస్లాం మతం దేశ సమగ్రత, ప్రపంచ శాంతిని కోరుకుంటుందని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ అన్నారు. శుక్రవారం జామియా మస్జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల తరువాత మాట్లాడుతూ నేడు ప్రపంచంలోని వివిధ దేశాల్లో ఉన్న ముస్లింలకు రక్షణ కరువైందన్నారు. నాడు మహమ్మద్ సొల్లె అలా సొల్లం ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నారన్నారు.అయితే సమస్యలు వచ్చినపుడు సంయమనంతో, సమయస్ఫూర్తితో వ్యవహించి పరిస్థితులను చక్కబెట్టె వారన్నారు. పరిస్థితులకు అనుగుణంగా నడచుకోవాలని ఇస్లాం మతం సూచిస్తుందన్నారు. 77 సంవత్సరాల స్వతంత్ర భారతం నేటికి శాంతి కోరుకుంటుందంటే మనం ఎక్కడ ఉన్నామో గుర్తించుకోవాలన్నారు.నేడు గజా పరిస్తితిని గమనించాలన్నారు. సమాజంలో పూర్తిగా శాంతి కొరవడింది. బాగా అభివృద్ధి చెందిన దేశాలు కూడా శాంతిగురించి మాట్లాడుతున్నామంటే మనం దైవభక్తికి స్వస్తి చెప్పటంతో అల్లాహ్ కరుణకు దూరమౌతున్నామన్నారు. ఈ దుస్థితినుంచి బయట పడాలంటే మనం అల్లాహ్ ఆరాధనను అలవాటు చేసుకోవాలని రేహాన్ పిలుపు నిచ్చారు.

## నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ధ్వజారోహణం

శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 16 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరులో వెలసిన అన్నపూర్ణసమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని చక్కగా అలంకరించారు. విద్యుత్ దీపాల కాంతితో ముస్తాబు చేసారు.శ్రీకాళహస్తి శాసనసభ్యుడుగా బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి గెలిచిన తరువాత వారి స్వగ్రామంలో మొదటి ధార్మిక ఉత్సవాలు నీలకంఠేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు.కాబట్టి అధికారులు కూడా జాగ్రత్తగా ఏర్పాట్లు చేసారు.ద్వజారోహణ కార్యక్రమాలను ఆలయ అర్చకులు జనార్ధనశర్మ పర్యవేక్షణలో చేపట్టారు.చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు హాజరు కాగా సంప్రదాయదబద్ధంగా, శాస్త్రోక్తంగా ధ్వజారోహణ కార్యక్రమాలు జరిగాయి,కార్యక్రమాలను ఆలయ డెప్యూటి ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, దుర్గాప్రసాద్ పర్యవేక్షించగా ఆలయ పౌరోహితులు అర్ధగిరి హాజరయ్యారు. నాయకులు మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యానాయుడు, గుప్తా, సీనియర్ నాయకులు కేశవులురెడ్డి,శివశంకర్‌రెడ్డి కృష్ణయ్య,నీలకంఠారెడ్డి,మాజీ కౌన్సిలర్ దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## జూనియర్ డాక్టర్ హత్యాచార నిందితులను శిక్షించాలి

ఎస్ఎఫ్ఐ




పుత్తూరు, ఆగస్టు 16 ప్రభాతవార్త :

కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన ఉన్మాదిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. పట్టణంలో శుక్రవారం చేసిన ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు ఆర్.వెంకటేష్ మాట్లాడుతూ ఒక మహిళ ముఖ్యమంత్రిగా వున్న పశ్చిమబెంగాల్‌లో మహిళలకు భద్రత లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కోల్‌కత్తా మెడికల్ కాలేజీలో సిసి కెమెరాలు కూడా పనిచేయకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించి ఉన్మాదిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## టిడిపి నాయకుడు మృతికి ఎమ్మెల్యే సంతాపం



నారాయణవనం, ఆగస్టు 16 ప్రభాతవార్త :

మండలకేంద్రంలోని నారాయణవనం దిగువ గాండ్ల వీధికి చెందిన టిడిపి నాయకుడు కుమార్ శుక్రవారం మృతి చెందారు. మృతుని వార్త తెలియడంతో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, మండల టిడిపి నాయకులు ఆర్‌డి ఏకాంబరం, ఎన భాస్కరన్, పి గోవిందస్వామి, కెఎస్‌రవి తదితరులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవడం జరుగుతుందన్నారు. మృతి చెందిన కుమార్ రేషన్‌డీలర్‌గా పని చేస్తున్నారు.

## కన్నుల పండువగా అర్జునుడు తపస్సు

### తపస్సు మాను చుట్టూ ప్రణమిల్లిన మహిళా భక్తులు



**ఏర్పేడు, ఆగస్టు16,ప్రభాతవార్త;** మండలంలోని పాపానాయుడుపేట గ్రామంలో వెలసిన శ్రీద్రౌపదీ దేవి సమేత ధర్మరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం చేనేత సంఘం వారి ఆధ్వర్యంలో గుడిమల్లం పరశురామేశ్వరాలయ చైర్మెన్ భత్తల గిరిబాబు నాయుడు కుటుంబ సభ్యులు స్వామి అమ్మవార్లను దర్శించి పట్టు వస్త్రాలను సమర్పించారు. మధ్యాహ్నం 12గంటలకు అర్జున వేషధారి మహాభారత ఘట్టాలను ఆలపిస్తూ భక్తి పరవశంతో తపస్సు మానును అధిరోహించారు. శ్రావణ శుక్రవారం మరియు వరలక్ష్మీ వ్రతం కావడంతో స్థానిక మహిళా భక్తులే కాకుండా, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు, సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. ఈసందర్భంగా కొందరు మహిళలు తపస్సు మాను చుట్టూ ప్రణమిల్లి మొక్కులు తీర్చుకున్నారు. తపస్సు మాను పై నుంచి అర్జున వేషదారి విసిరే నిమ్మపండ్లను దక్కించుకునేందుకు భక్తుల మధ్య తోపులాటతో భక్తులు కొంత ఇబ్బందులకు గురయ్యారు. ఏర్పేడు సిఐ శ్రీరామ శ్రీనివాస్, ఎస్సై జిలాని సిబ్బందితో రక్షణ చర్యలు చేపట్టారు. అదేవిదంగా ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం భక్తులకు చేనేత సంఘం వారి పర్యవేక్షణలో భక్తులకు అన్నదానం, తాగునీటిని అందజేశారు. అదేవిదంగా రాస్ నిర్వాహకులు వెంకటరత్నం నాయుడు స్వామి అమ్మవారి సేవలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించి శాశ్వత ఉబయదారులుగా రూ. 5116 నగదును కమిటి సభ్యులకు అందజేశారు.చేతి మధ్యాహ్నం 3గంటలకు భాగవతారిణి శివ కుమారి అర్జునుడు తపస్సు మాను అధిరోహించుట విశిష్టతను మధురాతి మధురంగా శ్రోతలకు హరికథా పద్య వచన రూపంలో వివరించారు.మేకలత్తూరు అన్నామలై, పూజారి రవి, తేజ, రాజేషశర్మ, తదితరులు పాల్గొని పూజలు ఘనంగా నిర్వహించారు.

## ఎమ్మెల్యే బొజ్జల ఘన స్వాగతం



**ఏర్పేడు, ఆగస్టు16, ప్రభాతవార్త;** శ్రీకాళహస్తి నియోజకవర్గం శాసన సభ్యులు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజస్వామి వారిని ఆయన శుక్రవారం దర్శించుకునేందుకు వచ్చిన ఆయనకు మండల టిడిపి నాయకులు, పాపానాయుడుపేట వాసులు, ఆలయ కమిటి చేనేత సంఘం వారు పూలమాలలతో ఆయనకు ఘన స్వాగ తం పలికారు. ఆలయ అర్చక బృందం ఆయన చేత ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందజేశారు. అదేవిదంగా దేవాలయం దగ్గర నూతనంగా ఏర్పాటు చేసిన చేతి పంపును ఆయన చేత ప్రారంభించారు. ఈకార్యక్రమంలో పేరం ధనంజయులు నాయుడు, ప్రతాపనేని మోహన్ నాయుడు, పేరం నాగరాజు నాయుడు, విరామ ఏఎస్పీ వి రాధయ్య,భత్తల గిరిబాబు నాయుడు, పేరం రమేష్ నాయుడు, వి కృష్ణప్ప మొదలి, రవి కుమార్, అర్జున్ బాబు, తంబా డిల్లీబాబు, జాఫర్, మురుగప్ప, దొరకృష్ణ, సురకాని శీను, రోశయ్య, త్యాగరాజ తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## నేడు వైద్య సేవల నిలిపివేత

తిరుపతి హెల్త్, ఆగస్టు 16, ప్రభాతవార్త

కోల్‌కత్తాలో ఆర్‌జీకర్ ప్రభుత్వ కళాశాల ఆసుపత్రిలో ఆగస్టు 9వ తేది రాత్రి డ్యూటీలో ఉన్న మహిళా వైద్యురాలిపై అమానుషంగా సామూహిక అత్యాచారం చేసి పాశవికంగా హత్య చేసిన కేసులో సత్వర న్యాయం కోసం డిమాండ్ చేస్తూ దానికి వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతున్న ఆర్‌జికర్ వైద్య కళాశాల ఆసుపత్రి విద్యార్థులు, వైద్యులపై ఆగస్టు 14వ తేది రాత్రి రౌడీ మూకలు దాడులను నిరసిస్తూ జాతీయ ఐఎంఏ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐఎంఏ శాఖలు 17వ తేది 24 గంటల పాటు వైద్య సేవలు నిలిపివేయాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు నగరంలోని, పట్టణంలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రులలో, అత్యవసరం కాని శస్త్ర చికిత్సలు పూర్తి స్థాయిలో నిలిపివేయడం జరుగుతుందని ఐఎంఏ శాఖ తెలిపింది. ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి, సిబిఐ ఆధ్వర్యంలో త్వరితగతిన నేర పరిశోధన పూర్తి చేసి, నేరానికి పాల్పడిన వారిపై కఠిన శిక్షలు పడేలా చూడాలని, ఆసుపత్రులలో డ్యూటీలో ఉన్న వైద్యులకు వైద్య సిబ్బందికి తగిన రక్షణ కల్పించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రత్యేక రక్షణ చట్టాలు కేంద్ర స్థాయిలో తీసుకురావాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న వైద్య సిబ్బంది రక్షణ చట్టాన్ని సవరించి కఠిన తరం చేయాలని ఐఎంఏ తిరుపతి శాఖ అధ్యక్షులు టి. జనార్ధన్, కార్యదర్శి డా. సి. వెంకటరమణ, కోశాధికారి డా. కృష్ణకాంత్ తెలిపారు. తమ డిమాండ్లను సాధించేవరకు ఈ ఉద్యమాన్ని ఆపేది లేదని, అవసరమైతే మరింత తీవ్రతరం చేస్తామని, వృత్తి నిర్వహణలో రక్షణ కల్పించమని అడుగుతున్న తమ న్యాయమైన డిమాండ్లకు ప్రజలు, ప్రజా సంఘాలు, అన్ని రాజకీయ పక్షాలు మద్దతు ఇవ్వాలని కోరారు.

## కరాటేలో నగరి విద్యార్థుల ప్రతిభ

నగరి, ఆగస్టు 16 ప్రభాతవార్త:



తమిళనాడు తిరునామలైలో నిర్వహించిన 48వ జపాన్ షిటోరాయ్ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియ న్‌షిప్ పోటీల్లోనగరి విద్యార్థులు ప్రతిభకనబరచారు. కరాటే మాస్టర్ అన్నాదొరై ఆధ్వర్యంలో నగరి నుంచి పోటీలకు హాజరైన విద్యార్థుల్లో 18 మంది విద్యార్థులు ప్రతిభను కనబరచి అవార్డులు అందుకున్నారు. కియోన్, కటా, కుమి తి అంటూ వివిధ విభాగాల్లో పోటీలకు హాజరైన విద్యా ర్థులు, అవార్డులు, సర్టిఫికెట్లు అందుకున్నట్లు కరాటే మాస్టర్ తెలిపారు. ఈపోటీలకుసినీనటుడుబబ్లూముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారన్నారు.

## భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం పూజలు

***బుచ్చినాయుడు కండ్రిగ, ఆగస్టు 16 ప్రభాతవార్త:*** శ్రావణమాసం శుక్రవారం వరలక్ష్మీవ్రతం పండుగ రావడంతో మహిళలు ప్రజలు ప్రత్యేకంగా భక్తిశ్రద్ధలతో నియమనిష్టలతో పూజా కార్యక్రమం నిర్వహించారు. శ్రావణ శుక్రవారం వరలక్ష్మీవ్రతం ఎంతో ప్రత్యేకత ఉందని అందుకే మండల ప్రజలు ఈ పూజలు కొందరు మహిళలు వారి స్వగృహాల్లో వరలక్ష్మి దేవికి పలు రకాల పలహారాలు పండ్లతో విశేషంగా అలంకరించి పూజ సమయంలో సమర్పించి ఘనంగా పూజా కార్యక్రమం జరుపుకున్నారు. అనంతరం అందుబాటులో ఉన్న అమ్మవారి దేవాలయాలకు సందర్శించి దేవాలయంలోని అమ్మవారిని దర్శించుకున్నారు. మండలంలోని నీర్పకోట చంగాలమ్మగుడిలో, పట్టాలమ్మ కాలనీ పచ్చలమ్మ గుడిలో పలు గ్రామాల్లో నెలకొని ఉన్న అమ్మవారి దేవాలయాలతో పాటు పలు దేవాలయం కూడా శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతం ప్రత్యేక పూజలను జరుపుకోవడం జరిగింది.

## పనితీరుకు ప్రశంసా పురస్కారం

చంద్రగిరి, ఆగస్టు 16 ప్రభాతవార్త:



విధి నిర్వహణలో తమ పనితీరు ద్వారా ప్రశంలందుకున్న వారికి సర్వత్రా అభినందనలు లభిస్తున్నాయి. స్థానిక బిసి వెల్ఫేర్ జూనియర్ కళాశాల బాలికల వసతి గృహం హెచ్‌డబ్ల్యుఓ మాలతి ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం రోజున రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ చేతుల మీదుగా చంద్రగిరి ఎంఎల్‌ఏ పులివర్తి నాని, తిరుపతి ఎంఎల్‌ఏ ఏ.శ్రీనివాసులు, ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం సమక్షంలో ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా డిబిసిడబ్ల్యు అండ్ ఈఓ ఎస్.చంద్రశేఖర్, ఏబిసి డబ్ల్యుఓ జ్యోష్నతో పాటు సహచర హెచ్‌డబ్ల్యుఓలు పహమదున్నీసా, శాంతకుమారి, మల్లికార్జున్, వనజ, హిమబింధు, తులసి చందన, బాబు, ఆమెను అభినందించారు. అదేవిధంగా శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో దఫేధార్‌గా విధులు నిర్వహిస్తున్న సుబ్రమణ్యం సేవలకు టిటిడి ఈఓ శ్యామలరావు, జెఈఓలు గౌతమి, వీరబ్రహ్మం చేతుల మీదుగా ప్రశంసా పత్రం, 5 గ్రాముల వెండి నాణెం బహుమతిగా అందుకున్నారు.

# అన్నక్యాంటీన్ల తో పేదలకు పండగ
# - ఎమ్మెల్సీ,సమన్వయకమిటీ చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, ఆగస్టు 16 ప్రభాతవార్త

రాష్ట్ర వ్యాప్తంగా సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో అన్న క్యాంటీన్ల ప్రారంభంతో పేదలు సంతోషంగా పండగ చేసుకుంటున్నారని ఎమ్మెల్సీ,సమన్వయకమిటీ చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం కుప్పం పార్కు వెనుక అన్న క్యా ంటీన్‌ను ఆయన కడ పి.డి. వికాస్ మర్మత్, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నంలతో కలసి ప్రారం భించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. స్వాతంత్ర్య దినాన సిఎం చంద్రబాబునాయుడు ఇదివరకు వైకాపా ప్రభుత్వం మూసేసిన ప్రతి అన్న క్యాంటీన్‌ను పునరుద్ధరించాలని లాంఛనంగా గుడివాడలో అన్నక్యాంటీన్‌ను ప్రారంభించారన్నారు. పేదలకు కడుపునిండా పట్టెడన్నం పెట్టేందుకే అన్న క్యా ంటీన్లు ప్రారంభించామన్నారు. దివంగత ఎన్టీఆర్ పేదల కోసం రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం తెచ్చారని అదే స్ఫూర్తితో పేదలకు, కూలీలకు,చిరుద్యోగులకు ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న



రీతిలో ఐదు రూపాయలతో ప్రజలకు మూడు పూటలా నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు తమ ప్రభుత్వం అన్న క్యాంటీన్లు ప్రారంభించిందన్నారు. ప్రతి క్యాంటీన్ వద్ద రోజుకు 1200మందికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందించడం జరుగుతుందన్నారు. అన్న క్యాంటీన్ల నిర్వహణకు సిఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరమ్మ ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున కోటి రూపాయల విరాళాన్ని అందించడం హర్షణీయమన్నారు. ఇదే స్ఫూర్తితో దాతలు ముందుకు రావాలని కోరారు. కడ పి.డి. వికాస్ మర్మత్ మాట్లాడుతూ కుప్పంలో కూలీలు, చిరువ్యాపారులకు అన్నక్యాంటీన్ ద్వారా నాణ్యమైన భోజనం అందించే కార్యక్రమం ప్రారంభించడం హర్షణీయమన్నారు. పేదలు ఆకలితో పస్తులు ఉండరాదని సిఎం చంద్రబాబునాయుడు అన్నక్యాంటీన్ల ద్వారా తక్కువ ధరకే భోజనాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ॢ డిఎస్పీ పార్థసారథి, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, రాష్ట్ర నేతలు డా॥ బిఆర్ సురేష్‌బాబు,గోపీనాథ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, కౌన్సిలర్లు జిమ్‌దాము, సోమశేఖర్, జాకీర్, వేలు, నేతలు బిఎంకె రవిచంద్ర, డా॥ వెంకటేష్, ఆర్ఆర్ రవి, సత్యేంద్రశేఖర్, ఆర్ముగం,మంజు, జనసేన నరేష్, బిజెపి శివశంకర్ పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని అటల్‌బీహారీ వాజ్‌పేయికి నివాళులు
### -పాల్గొన్న ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు



శ్రీకాళహస్తి, ఆగస్టు 16 ప్రభాతవార్త

భారత మాజీ ప్రధానమంత్రి అటల్‌బీహారి వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా పట్టణంలోని పాతస్టాండు సర్కిల్ వద్ద ఆయన చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా జాతీయ ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్. లక్ష్మణ్, రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా.ఆనంద్‌కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గరికపాటిరమేష్‌బాబు సారథ్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా జాతీయ ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్. లక్ష్మణ్ మాట్లాడుతూ జాతీయవాదిగా, నిస్వార్థ నేతగా రాజకీయ విలువలు కలిగిన నేతల్లో ప్రముఖుడు అటల్‌బీహారి వాజ్‌పేయి అని కొనియాడారు. అటల్‌జీ ఆశయాలను కొనసాగింపుతో భారతదేశాన్ని 2047 నాటిని విశ్వగురువుగా నిలపడానికి అహర్నిశలు కృషి చేస్తున్న ప్రధాని నరేంద్రమోడికి దేవుని ఆశీస్సులు ఉన్నాయన్నారు.కోలా.ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ వాజ్‌పేయి దేశానికి చేసిన సేవలు సదా చిరస్మరణీయం అన్నారు. ప్రపంచదేశాలకు భయపడకుండా అణుపరీక్షలు విజయవంతంగా జరిపిన దీశాలి అని బిజెపి అభివృద్ధికోసం ఎంతో కృషి చేశారన్నారు. జాతీయ రహదారులు నిర్మించడంలో ఆయన ఎంతో కృషిచేశారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కంద్రిగ.ఉమ, కో కన్వీనర్ మేళాగారంసుబ్రమణ్యంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు గరికపాటిరమేష్‌బాబు, అసెంబ్లీ కో కన్వీనర్ మేళాగారంసుబ్రమణ్యంరెడ్డి, కార్యవర్గ సభ్యురాలు కంద్రిగ.ఉమ, ఎస్వీరమణ, జిల్లా ఉపాధ్యక్షులు కొండేటది గోపాల్, ఉమాసింగ్, వేదాం కృష్ణయ్య, కూనాటి నాగరాజు, ఈగబాలాజీ, పెద్దపాలెం రవి ఆచారి, హరీష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు వాసుయాదవ్, పుణ్యండిల్లీకుమార్, సజ్జలహరీష్, బాలుగురవయ్యయాదవ్, రాజ, నరేష్, నాని తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ గౌతు లచ్చన్నకు ఘన నివాళి

తిరుపతి రవాణా, ఆగస్టు 16, ప్రభాతవార్త



ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, పేదల పాలిట పెన్నిధి డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న 115 జయంతి సందర్భంగా తిరుపతి గౌడ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గౌతు లచ్చన్న సేవలను గురించి పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌడ్ సంఘం నేతలు యార్లపల్లి గోపి, ఆనంద్ బాబు, చెంగయ్య, చిరంజీవి గౌడ్, గిరిధర్, మురారి గౌడ్, లోకనాథం పాల్గొన్నారు.

## కొత్తగుంటలో బార్లను తలపిస్తున్న బెల్టుషాపులు
### - చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న పోలీసు, ఎక్సైజ్ అధికారులు

చిట్టమూరు, ఆగస్టు 16 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వంలో అయినా మద్యం బెల్టుషాపులను అరికట్టి వినియోగదారులకు నాణ్యమైన మద్యం అందిస్తామని భావిస్తున్న ప్రజలకు చుక్కెదురవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ప్రభుత్వంలో కంటే విచ్చలవిడిగా మండల ప్రధాన కూడలి ప్రాంతమైన కొత్తగుంట గ్రామంలో రెండు మద్యం బెల్టుషాపులు బార్లను తలపించేలా పోటాపోటీగా అమ్మకాలు సాగిస్తున్నప్పటికీ పోలీసులు, ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రోజు ఏదయినా, సందర్భంగా ఏమయినా కొత్తగుంటలో మద్యంషాపుకు ఎదురుగా ఉన్న రెండు దుకాణాల్లో ఈ తంతు గత ఐదేళ్లుగా జరుగుతోంది. ముఖ్యంగా ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం నాడు సైతం సాక్షాత్తు ఎక్సైజ్ అధికారులు, పోలీసుల కళ్ల ముందే రెండు మద్యం బెల్టుషాపుల్లో ఏకంగా 700 మద్యం బాటిళ్లు విక్రయించినట్లు సమాచారం. ఒక్కో మద్యం బాటిల్‌పై 50 నుంచి రూ.100 అధికంగా వసూలు చేస్తున్నా నియంత్రించాల్సిన పోలీసు అధికారులు కళ్లుండి చూడలేని కబోదుల్లా వ్యవహరిస్తూ మామూళ్ల మత్తులో జోగుతున్నారని మండల ప్రజలతో పాటు మండల కార్యాలయాలకు వెళ్లే అధికారులు సైతం విమర్శలు చేస్తున్నారు. ఏ సమయంలో అయినా మద్యం రెడీ అంటూ ఇరు షాపుల యజమానులు రోడ్డుపైకొచ్చి మా షాపుకు రండి అంటూ వినియోగదారులను ఆకర్షిస్తూ మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగిస్తున్నారు. పోలీసుస్టేషన్‌కు అత్యంత సమీపంలో ఈ తంతు జరుగుతున్నప్పటికీ పోలీసు శాఖ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటో వారికే తెలాయల్సి ఉంది. ఉన్నతాధికారులు దృష్టి సారించి చిట్టమూరు మండలం కొత్తగుంటలోని ప్రధాన రహదారి పరిధిలో ఉన్న రెండు దుకాణాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగిస్తూ బార్లను తలపిస్తున్న దుకాణాలపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు

## ఇందిరమ్మ ఇళ్లకు నీటి దాహార్తి తీరింది
### -పులివర్తి నాని సహకారంతో ఇందిరమ్మ ఇండ్లలో మౌళికసదుపాయాలు
### -తనపల్లి టిడిపి అధ్యక్షుడు బాలచంద్రారెడ్డి

తిరుపతిరూరల్, ఆగష్టు16 ప్రభాతవార్త:



తనపల్లి ఇందిరమ్మ కాలనీలో దశలవారీగా అభివృద్ధి పనులు చేస్తామని, మరమ్మత్తుకు గురైన బోరు మోటర్లను మరమ్మత్తులు చేసి, దాహార్తిని తీర్చినట్లు తనపల్లి టిడిపి అధ్యక్షుడు బి.బాలచంద్రారెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే పులివర్తి నాని సహకారంతో ఇందిరమ్మ కాలనీలో మౌళిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. గత ఐదు సంవత్సరాల కాలంలో ఇందిరమ్మకాలనీ వాసులు దుర్భర జీవితాన్ని గడిపినట్లు కాలనీ వాసులు తెలిపారని ఆవేదన వ్యక్తం చేసారు. బోరుమోటర్లు మరమ్మత్తుకు గురైనా ఎవ్వరు పట్టించుకోలేదని, వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదని స్థానికులు తమ దృష్టికి తీసుకొచ్చినట్లు బాలచంద్రారెడ్డి తెలిపారు. తనపల్లి ఇందిరమ్మ కాలనీలో 1400 ఇండ్లకు గాను ఏడు బోరు మోటరులు ఉన్నాయని,, అన్ని బోరు మోటర్లు మరమ్మత్తుకు గురైనాయని తెలిపారు. ఇప్పటివరకు మూడు బోర్లును రీ సైక్లింగ్ చేసి, మోటరు బిగించినట్లు తెలిపారు. దశలవారీగా ఇందిరమ్మ కాలనీలలో అభివృద్ధి పనులు చేస్తామని తెలిపారు.

## దోమల కట్టడికి పక్కా చర్యలు
### - జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతిదేవి

**యాదమరి, ఆగస్టు 16 ప్రభాతవార్త:** క్షేత్ర స్థాయిలో దోమలను కట్టడి చేయడానికి పక్కాగా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతిదేవి ఆదేశించారు. మాదిరెడ్డిపల్లి పిహెచ్‌సి పరిధిలోని రసూల్ నగర్ గ్రామంలో ఇది వరకు డెంగ్యూ జ్వరం సోకిన బాలిక ఇంటిని శుక్రవారం డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రభావతిదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా రసూల్ నగర్ గ్రామంలోని ఇళ్ళ పరిసరాలను చూసి డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రభావతిదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్ళ నివాసాల మధ్య నీటి నిల్వ ఇలా వుంటే ఎలాగని స్థానిక ప్రజలను ఆమె ప్రశ్నించారు. పంచాయతీ అధికారులు ఇక్కడ పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నారా! లేదా! అని ప్రశ్నించారు. ఇక్కడి క్షేత్ర స్థాయి పరిస్థితులను జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి తీసుకెళ్ళి చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి అనిల్‌కుమార్, మాదిరెడ్డిపల్లి పిహెచ్‌సి డాక్టర్ శివకుమార్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ పీరుసాహెబ్, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంతో దగా పడుతున్న ఎస్సీ ఎస్టీలు
### ప్రోటో కాల్ పాటించని జిల్లా స్థాయి అధికారులు , అన్యాయం జరిగితే సహించేది లేదు
### న్యాయం కోసం అండగా ఉంటా
### జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాతోతూ హుస్సేన్

తిరుపతి రవాణా, ఆగస్టు 16, ప్రభాతవార్త



జిల్లాలో అధికారులు నాయకుల నిర్లక్ష్యంతో ఎస్సి, ఎస్టీ జాతి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతూ నష్టపోతున్నారని ఎస్టీ జాతీయ కమిషనర్ సభ్యులు జాతోతు హుస్సేన్ ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమల పర్యటనలో భాగంగా శుక్రవారం శ్రీ పద్మావతి అతిధి గృహంలో ఎస్సీ, ఎస్టీ సంఘ నేతలతో సమావేశంలో ఆయన వారిచే వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ బిడ్డలు తీవ్ర అన్యాయానికి గురవుతూ సదుపాయాలకు నోచుకోకుండా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో బాధితల ఇస్తున్న ఫిర్యాదులు చూస్తుంటే హృదయం చలించిందని తెలిపారు. గత ఐదేళ్ల పాలనలో పేదలైన ఎస్సి ఎస్టీల భూములు కబ్జా చేయడం, దాడులకు పాల్పడడం, వాళ్ల జీవనోపాధిని సైతం చేసుకొని ఇవ్వకుండా అడ్డుపడేటువంటి అనేక సంఘటనలు ఈ సందర్భంగా తన దృష్టికి వచ్చాయని తెలిపారు. అర్ధగంట సమావేశం అనుకుంటే సమావేశంలో తన దృష్టికి వచ్చిన బాధిత ఎస్సీ ఎస్టీల బాధలతో ఎక్కువ సమయం ఉండాల్సి వచ్చిందని తెలిపారు. ఒక జాతీయ ఎస్టీ కమిషనర్ సభ్యులుగా పర్యటనకు వచ్చినప్పుడు జిల్లా అధికారులు ప్రోటోకాల్ పాటించకపోవడం దుర్మార్గమన్నారు. ఒక కమిషన్ సభ్యుడికి ప్రోటోకాల్ పాటించని అధికారులు ప్రజలకు ఏం న్యాయం చేస్తారని ప్రశ్నించారు. ప్రజలకు సేవ చేయడానికి ఉద్యోగాలు ఉన్నాయన్న విషయాన్ని కూడా మరిచి అధికారులు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ప్రత్యేకంగా తిరుమలలో వ్యాపారాలు చేసుకుంటున్న ఎస్టిలైన నక్కల బిడ్డలను అక్కడ నుంచి తరిమేసే ప్రయత్నం చేస్తూ వాళ్ళను వెళ్లగొట్టే ప్రయత్నించడం దారుణమన్నారు. వ్యాపారాల కోసం 1100 షాపులు కొత్తగా ఇస్తున్న, అక్కడ వ్యాపారాన్ని జీవనంగా భావించే బతుకుతున్న నక్కల వాళ్లకి కనీసం సౌకర్యాలు కూడా కల్పించడం లేదని వాపోయారు. ఫారెస్టు అధికారుల సైతం వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఇది అధికారుల దుర్మార్గ చర్య అన్నారు. అంతేకాక టిటిడిలో రోస్టర్ పద్ధతిని సైతం విస్మరించారని తెలిపారు. శనివారం జరిగే టిటిడి రివ్యూ మీటింగ్‌లో ఎస్సీ, ఎస్టీలను ఇబ్బందులకు గురిచేసిన వాళ్ళందరూ సమాధానం చెప్పాలన్నారు. దైవమున్న చోట దెయ్యాలు ఉన్నట్లు టిటిడి అధికారుల, నాయకులు తీరు ఉందని మండిపడ్డారు. నేడు జరిగే రివ్యూలో ఎస్సీ, ఎస్టీ ప్రజల సమస్యలను అక్కడకక్కడకే అధికారులు పరిష్కార మార్గం చూపాల్సి వుంటుందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో ఎస్సి, ఎస్టిలకు అన్యాయం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. జిల్లాలో ఎవరైనా ఎస్సీ, ఎస్టీ ప్రజలను ఇబ్బంది పెడితే తనకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదులు చేసిన తక్షణమే సంబంధిత అధికారులకు నోటీసులు పంపించి సమస్య పరిష్కారానికి తన కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ సూర్యనారాయణ, ఇతర అధికారులు, బంజారా సేవా సంఘం జాతీయ కన్వీనర్ శివనాయక్, బిజెపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప, గిరిజన మోర్చా అధ్యక్షులు గుండాల నాయక్, శివకుమార్ నాయక్, చంద్రశేఖర్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేణిగుంట తూకివాకంకు చెందిన నక్కల సేవా సంఘం నేతలు అల్లీ బాబా, వేల్మురుగన్ సురేష్, కార్తీక్, గిరిజన భవన్ ట్రస్ట్ నేతలు, వివిధ ఎస్సి, ఎస్టీ సంఘాల నాయకులు తమ సమస్యలను అర్జీల రూపంలో అందించారు. ఎస్టి కమిషన్ సభ్యులకు వినతి ఇచ్చిన వారిలో బిజెపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప, గిరిజన భవన్ ట్రస్టు చైర్మన్ వెంకటరమణ నాయక్‌తో పాటు జిల్లాలో ఎస్సి, ఎస్టీ బాధితులు పాల్గొన్నారు. అనంతరం వివిధ ఎస్సి ఎస్టీ సంఘాల నేతలు ఘనంగా సత్కరించారు.

## విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోండి

తిరుపతి విద్య, ఆగస్టు 16, ప్రభాతవార్త



మేనేజ్మెంట్ కోసం చదివిన విద్యార్థులు కార్పొరేట్, వ్యాపార రంగంలో వస్తున్న నూతన పోకడలకనుగుణంగా వివిధ రకాల నైపుణ్యాలను పెంపొందించుకొని వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకునే ఉన్నత రంగాలలో రాణించాలని ఆర్‌సిఆర్ మేనేజ్మెంట్ కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపల్ వి. రవికుమార్ చౌదరి పిలుపునిచ్చారు. తిరుపతి కరకంబాడి రోడ్డులోని ఆర్సిఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ అండ్ టెక్నాలజీ కళాశాలలో కళాశాల గ్రాడ్యుయేషన్ డే, సీనియర్ విద్యార్థుల వీడ్కోలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్‌బి హర్షవర్ధన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిత్వ నిర్మాణం విజయానికి సోపానంగా మారుతుందని, వ్యక్తి శక్తిగా మారాలంటే విద్యతో పాటు సానుకూల దృక్పథం, నిజాయితీ, విశ్వసనీయత, సామర్థ్యం వంటి నైపుణ్యాలు ఆవశ్యకం అన్నారు. కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ వి. రవికుమార్ చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు ఎంబీఏ కోర్సు సర్టిఫికేట్‌తో పాటు వివిధ రకాల యాజమాన్య నైపుణ్యాలతో పాటుగా కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి అంశాల్లో ఎంతో చలాకీగా వ్యవహరించాలన్నారు. ముఖ్యంగా మేనేజ్మెంట్ విద్యార్థులు భవిష్యత్తు పరిణామాలను అంచనా వేయడం, జట్టుకు ప్రేరణ కలిగించడం, సమన్వయంతో వ్యవహరించడం సమస్య వచ్చినప్పుడు పరిష్కార మార్గాలు వెతికి, చేసిన లోపాలను సరిదిద్దుకొని ముందుకు సాగడం వంటి అంశాలలో చాకచక్యంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి వై. నిరీష, ఎంసిఏ విభాగాధిపతి లలిత, అధ్యాపకులు సతీష్, మురళి, మణికంఠ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు కుప్పంలో వైద్యులు విధుల బహిష్కరణ - ఐఎంఏ అధ్యక్షుడు డా॥ మంజునాథ్

కుప్పం, ఆగస్టు 16 ప్రభాతవార్త



కోల్‌కత్తా నగరంలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్యను నిరశిస్తూ కుప్పంలో శనివారం నుంచి24గంటల పాటు వైద్యులు విధులు బహిష్కరిస్తున్నట్లు కుప్పం బ్రాంచ్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డా॥ మంజునాథ్ పేర్కొన్నారు. శనివారం ఉదయం 6గంటలనుంచి ఆదివారం ఉదయం 6గంటల దాకా డాక్టర్లు విధులు బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఓపిడి విభాగాలను మూసివేయడం జరుగుతుంద న్నారు. అత్యవసర విభాగాలు పనిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కోల్‌కతా ఘటనలో బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు.ఈఘటన దేశాన్ని కలచివేస్తోందన్నారు. మహిళా డాక్టర్లకు ప్రభుత్వాలుభద్రతకల్పించాలన్నారు. ప్రజలు కూడా తమ విధుల బహిష్కరణకు సహకరించాలని కోరారు.

## చంద్రశేఖర్‌కి వరల్డ్ బెస్ట్ అచీవర్ అవార్డు

తిరుపతి విద్య, ఆగస్టు 16, ప్రభాతవార్త



స్థానిక బాలాజీ కాలనీలో ఉన్న ఎస్‌వి ఆర్ట్స్ కళాశాలలో ఫిజిక్స్ విభాగంలో బోధన పరిశోధన రంగాల్లో విశేష కృషి చేసిన అధ్యాపకుడు డాక్టర్ ఏవి చంద్రశేఖర్ కి వరల్డ్ బెస్ట్ అచీవర్ అవార్డును న్యూ ఢిల్లీకి చెందిన ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ వేణుగోపాల్ రెడ్డి, భీమన్న, సి సుబ్రమణ్యం , కామేశ్వర రావు, మధుసూధన్, అన్నయ్య, సురేష్ తదితరులు అభినందనలు తెలిపారు.

## వరసిద్ధుని సేవలో కైకలూరు ఎమ్మెల్యే కామినేని

**కాణిపాకం, ఆగస్టు 16 ప్రభాతవార్త:** కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ కాణిపాకం ఆలయ



సినీ నిర్మాత కెఎల్ నారాయణలతో కలసి శుక్రవారం నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని ...న ఆలయ ఈఓ కె.వాణి, అర్చకులు ఆలయ మర్యాదలతో ...కి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి ...పంలో వేదాశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, అలాగే శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ నిర్వహించారు.వారి వెంట ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవి, ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, స్థానిక మాజీ సర్పంచ్ మధుసూధన్‌రావు, జిల్లా బిజెపీ అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు, ఉపాధ్యక్షుడు కెవి.చంద్రమోహన్, ఐరాల మండల అధ్యక్షుడు కుమార్‌లతో పాటు పలువురు బిజెపీ నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ ద్రౌపదీదేవి బ్రహ్మోత్సవాల్లో మూడు రోజులు స్కౌట్స్ సేవలు

**పుత్తూరురూరల్, ఆగస్టు 16 ప్రభాతవార్త:** ఆగస్టు 16 శుక్రవారం శ్రీ ద్రౌపదీదేవి బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు అర్జునుని తపస్సులో స్కౌట్స్ అండ్ గైడ్స్ విశిష్ట సేవలను అందించారు. వరపడి వచ్చిన భక్తులకు ఎటువంటి ఆవంచనీయ తోపుట్లు సంఘటనలు జరగకుండా చుట్టూ బందోబస్తు చేస్తూ భక్తులకు విశిష్టసేవలను అందించారు. అదే విధంగా ఆగస్టు 17న శనివారం సాయంత్రం రథోత్సవంలో ఇరువైపులా భక్తులను క్రమబద్ధీకరిస్తూ పురవీధుల్లో రథోత్సవంలో భక్తులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా విద్యార్థులు సేవలు అందించడం, ఆగస్టు 18 ఆదివారం ఆలయ భక్తులకు క్యూలైన్‌లో ఎటువంటి ఇబ్బంది కలగకుండా వారికి తాగునీరు అందించడం, ఆలయ అగ్నిగుండ ప్రవేశంలో భక్తుల రద్దీని ఉద్దేశించి వారిని ప్రత్యేక లైన్‌లో పంపించడం జరుగుతుందని స్కౌట్స్ అండ్ గైడ్స్ తిరుపతి జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ వెంకటేశ్వరులు తెలిపారు. కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ అశోక్‌కుమార్, రోవర్ లీడర్ లోకేష్, గైడ్ కెప్టెన్ సుజాత, రెడ్డివాణి, సునీత, రాధిక, నాగరత్నం, రేంజర్ లీడర్ భువనేశ్వరి, మల్లేశ్వరి, సుప్రియ, దీపిక, గొల్లపల్లి, ఎస్‌బీఆర్ పురం, రాచపాళెం, గేటు పుత్తూరు ప్రభుత్వ హైస్కూలు, బాలికల ఉన్నత పాఠశాల, నారాయణవనం జడ్పీ హైస్కూలు స్కౌట్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

## తవణంపల్లెలో భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం

**తవణంపల్లె, ఆగస్టు 16 వరలక్ష్మీవ్రతం** పండుగ పర్వదినాన్ని మండలంలోని మహిళలు శుక్రవారం సంప్రదాయబద్ధంగా అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. శ్రావణమాసంలో శుక్రవారం వచ్చే వరలక్ష్మీవ్రతంను మండలంలోని మహిళలు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ముత్తైదువలు ఆయా గ్రామాలలోని అమ్మవారి ఆలయాలు, ఇళ్ళలో ఈవ్రతాన్ని ఆచరించారు. ఈసందర్భంగా ఆలయంలలో అమ్మవారి ప్రతిమను పసుపుతో తయారుచేసి, పిండి వంటలను నైవేద్యంగా సమర్పించి తాము నిత్య సుమంగళిగా, సౌభాగ్యంగా వుండాలని కోరుతూ మంత్రోచ్ఛరణల నడుమ భక్తి శ్రద్ధలతో వ్రతాన్ని నిర్వహించారు.

## అంకితభావ సేవలకు గుర్తింపు

తిరుమల,ఆగస్ట్ 16ప్రభాతవార్తప్రతినిధి:



శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న భక్తులకు మరింత సంతృప్తికరంగా వసతి కల్పన సేవలందించడంలో అంకితభావంతో పనిచేస్తున్న డిప్యూటీ ఈఓ పి.హరీంద్రనాథ్‌ను అభినందించారు. స్వాతంత్ర్యదినోత్సవంలో వివిధ విభాగాల్లో అంకితభావసేవలందించిన 36మంది అధికారులు, 251మంది ఉద్యోగులకు ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ వెంకయ్యచౌదరి శ్రీవారి వెండిడాలర్, ప్రశంసాపత్రం అందజేశారు.

## భవిష్యత్తుకు పాఠశాలలే చాలా కీలకం - సుమిత్ మెహతా

తిరుపతి విద్య, ఆగస్టు 16, ప్రభాతవార్త

భవిష్యత్తుకు పాఠశాలలే చాలా కీలకమని లీడ్ గ్రూప్ సిఈఓ సమిత్ మెహతా తెలిపారు. ది పల్స్ ఆఫ్ స్కూల్ లీడర్ సర్వేను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ పాఠశాలలు మన భవిష్యత్తుకు కీలకం, విద్యార్థులు ఆకాంక్షలు, వారి సవాళ్లు, ఏమీ పని చేస్తున్నాయి. ఏమి మార్చాలి అనేది తెలుసుకోవడం ముఖ్యం. మేము మల్టి మోడల్ లెర్నింగ్ ద్వారా ఉపాధ్యాయులను శక్తివంతం చేయడానికి సాంకేతికతను ఉపయోగించడానికి ఇంటిగ్రేటెడ్ సిస్టం ద్వారా మల్టీ లెర్నింగ్ ప్రవేశ పెట్టామన్నారు. ఈ సర్వే ఫలితాలు మా నమ్మకాన్ని మరింత బలపరుస్తున్నాయని అన్నారు. దేశంలోని ప్రతి బిడ్డకు ప్రపంచ స్థాయి విద్యను అందుబాటులోకి తీసుకురావడమే మా లక్ష్యం. 21వ శతాబ్దంలో వారు రాణించడానికి అవసరమైన నైపుణ్యాలు, జ్ఞానాన్ని వారికి అందిస్తున్నామని వెల్లడించారు. గత నెలలో 4 సంవత్సరాలు పూర్తి చేసుకున్న జాతీయ విద్యా విధానం 2020 భారతదేశం అందరికీ నాణ్యమైన విద్యను అందించడం, విద్యాపరమైన నైపుణాన్ని పెంపొందించాలనే దాని దృక్పధాన్ని గ్రహించేలా ఒక బలమైన కార్యాచరణను అందిస్తుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకించి, ఇంటిగ్రేటెడ్ సిస్టమ్‌లను ఉపయోగిస్తున్న 94 శాతం పాఠశాలలు తమ విద్యార్థులలో మంచి విశ్వాస స్థాయిలను పెంపొందించాయని నివేదించినట్లు తెలిపారు.

## సిఐ చొరవతో రోడ్లకు మరమ్మత్తులు

**సత్యవేడు,ఆగస్టు16,ప్రభాతవార్త:** ఇటీవల సత్యవేడు



సిఐ గా భాద్యతలు చేపట్టిన మురళి రోడ్ల మరమ్మత్తులపై చొరవ చూపారు.గుంతల మయంగా మారిన రోడ్లతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు, వాహన దారుల ఇబ్బందులను గుర్తించిన ఆయన రోడ్లకు తాత్కాలిక మరమ్మత్తులుచేపట్టారు. శుక్రువారం పోలీస్ సిబ్బంది హరి, ప్రతాప్ లు ప్రొక్లైనర్ సాయంతో గుంతల మయంగా మారిన రోడ్లకు కంకరతో మరమ్మత్తులు నిర్వహించారు.

## ట్రాఫిక్‌కు అడ్డంగా వున్న బ్యానర్లు, ఫ్లెక్సీలు తొలగింపు
### - మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ విస్తృతంగా తనిఖీలు

**చిత్తూరు, ఆగస్టు 16 ప్రభాతవార్త:**



చిత్తూరు నగర పరిధిలో రోడ్డుపైకి వచ్చిన, ట్రాఫిక్‌కు అడ్డంగా వున్న అనధికార బ్యానర్లు, ఫ్లెక్సీలను సత్వరం తొలగించాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. నగర పరిధిలోని పలు చోట్ల ఫ్లెక్సీలు, బ్యానర్లు ప్రమాదకరంగా వున్నాయని ప్రజల నుండి ఫిర్యాదులు రావడంతో కమీషనర్ డాక్టర్ జె.అరుణ శుక్రవారం నగరంలోని ప్రధాన రహదారులు, ప్రధాన కూడళ్ళలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అప్పటికే మున్సిపల్ సిబ్బంది నగర పరిధిలో అనధికారికంగా ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు అడ్డంగా వున్న పలు బ్యానర్లు, ఫ్లెక్సీల తొలగింపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కొంగారెడ్డిపల్లి, కలెక్టర్ బంగ్లా రోడ్డు, గాంధీ సర్కిల్, సంతపేట, ఎంఎస్ఆర్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బంది చేపట్టిన బ్యానర్ల తొలగింపు ప్రక్రియను కమీషనర్ పరిశీలించారు. కూడళ్ళు, ప్రధాన రహదారులు, వీధులు, రోడ్లపైకి వచ్చిన బ్యానర్లు, ఫ్లెక్సీలను సత్వరం తొలగించాలని కమీషనర్ టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్ అధికారులను ఆదేశించారు. రోడ్లపైకి రాకపోకలు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. నగర పరిధిలో బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయదలచిన వారు తప్పనిసరిగా అనుమతి తీసుకుని ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ రామకృష్ణుడు, ఎంహెచ్ఓ డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

# గణనాధుని సన్నిధిలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు

కాణిపాకం, ఆగస్టు 16 ప్రభాతవార్త:

రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కుటుంబసమేతంగా శుక్రవారం సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ఆలయ వెలుపల ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ఈఓ కె.వాణి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈసందర్భంగా ప్రధాన ఆలయంలోని బంగారు ధ్వజస్తంభం వద్ద నుండి మంగళవాయిద్యాల నడుమ స్వామివారికి పట్టువస్త్రాలను తీసుకువెళ్ళి సమర్పించి స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు వేదమండపంలో వేదాశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించగా ఎమ్మెల్యే మురళీమోహన్ స్వామివారి ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. అలాగే శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయన వెంట చిత్తూరు డీఆర్ఓ



పుల్లయ్య, ఆర్డీఓ చిన్నెయ్య, ఐరాల తహశీల్దార్ మహేష్‌బాబు,దేవాదాయశాఖ మాజీ అదనపు కమీషనర్ జి.కేశవులు, ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవి, ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, ఐరాల, బంగారుపాళ్యం మండల టీడీపీ అధ్యక్షులు మల్లారపల్లె గిరిధర్‌బాబు. జయప్రకాష్‌నాయుడు, స్థానిక మాజీ సర్పంచ్ మధుసూదన్‌రావు, స్థానిక నాయకులు నరసింహులు నాయుడు, శేషాద్రి నాయుడు, హేమాద్రినాయుడు, మోహన్‌బాబు, బాబునాయుడులతో పాటు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకం ఆలయ అభివృద్ధికి ప్రభుత్వ సహకారం

ప్రముఖ పుణ్యక్షేత్రంగా దినదినాభివృద్ధి చెందుతున్న కాణిపాకం ఆలయ అభివృద్ధికి ప్రభుత్వ తరపున సహకారం అందిస్తామని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. కాణిపాకం ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయన స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్‌తో కలసి ఆలయ అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడుతూ కాణిపాకం ఆలయం ఇప్పటికే రాష్ట్రంలోనపి ప్రముఖ ఆలయాలలో ఒకటిగా అభివృద్ధి చెందిందని తెలిపారు. ఈమేరకు తిరుమల, అన్నవరం, సింహాచలం, శ్రీకాళహస్తి వంటి ఆలయాలతో పాటు అభివృద్ధి చెంతుతోందని తెలిపారు. ఆలయాలు అభివృద్ధి చెందడం ద్వారా ఆలయ పరిసరాల్లో ఎన్నో వేల మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తోందని తెలిపారు. ఇప్పటికే కాణిపాకం ఆలయం ఎంతో అభివృద్ధి చెందిందని, ఇంకా సౌకర్యాల పట్ల ఎంతో అభివృద్ధి చెందాలని, అధిక సంఖ్యలో భక్తులు కాణిపాకం వచ్చి తిరుమల తరహాలో అభివృద్ధి చెందాలని అయ్యన్నపాత్రుడు ఆకాంక్షించారు. ఈవిలేకరుల సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్త మృతి
### - మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామి నివాళులు



**శ్రీరంగరాజపురం, ఆగస్టు 16 ప్రభాతవార్త:** మండలంలోని 49 కొత్తపల్లి సర్పంచ్ డివి ఢిల్లయ్య సతీమణి, అంగన్‌వాడీ కార్యకర్త వేదమణి(61) అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందారు. మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామి, వైకాపా నాయకులు శుక్రవారం 49 కొత్తపల్లి చేరుకుని సర్పంచ్ డివి ఢిల్లయ్య సతీమణి వేదమణి భౌతికకాయానికి నివాళులు అర్పించి సర్పంచ్ ఢిల్లయ్య కుటుంబసభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు కోటిబాబు, విజయబాబు, జనార్దన్, గుణశేఖర్‌నాయుడు, సుబ్రమణ్యం, గోవిందరెడ్డి, దేవరాజులురెడ్డి, మంగుంట మునికృష్ణ, ఆదిశయరాజు, యేసురత్నం తదితరులు పాల్గొన్నారు.